ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 30.05.2026 | సంపుటి :12 సంచిక : 310 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# సెక్యులర్ ఓట్లపై ఎస్ఐఆర్ కుట్ర



## ఈ ప్రక్రియతో తలెత్తే సమస్యలపై రాష్ట్ర నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి

- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు 'సర్' పెద్ద సమస్య కావొచ్చు
- దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశముంది.
- ఎస్ఐఆర్ కోసం అన్ని నియోజకవర్గాల్లోనూ ఇన్‌ఛార్జ్‌లు
- క్షేత్రస్థాయిలో కార్యకర్తలను 10 రోజులకోసారి కలుస్తాను అందుకు నెలకు 3 రోజులు సమయం కేటాయిస్తా.
- నాతో సహా అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే : సీఎం రేవంత్
- బూత్ ఎన్‌రోలర్ల సాయంతో 45 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించాం
- గాంధీభవన్ టీపీసీసీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో తలెత్తే సమస్యలపై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు ఎస్ఐఆర్ పెద్ద సమస్య కావొచ్చన్నారు. "ఎస్ఐఆర్‌తో దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశముంది. దీనివల్ల తలెత్తే సమస్యలపై నేతలకు పూర్తి అవగాహన ఉండాలి. మిగతా 2లో..




# దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొంటున్నది తెలంగాణే

## రాష్ట్రంలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- చివరి ధాన్యం గింజ వరకూ కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి




**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దాని కంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13 వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే మిగతా 2లో..

# జూన్ 5 తరువాతే తెలంగాణకు నైరుతి

హైదరాబాద్(జనంసాక్షి):ఈసారి నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ఈ మేరకు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ ముందుగా అంచనా వేసినప్పటికీ దానికి భిన్నంగా రుతుపవనాల కదలికలు ఉన్నాయి. మిగతా 2లో..

రుతుపవనాల రాక మరింత ఆలస్యం : వాతావరణశాఖ



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం మిగతా 9లో..

# ఉద్యోగుల బకాయిలు రూ.2వేల కోట్లు విడుదల

### తొలివిడతగా మంజూరు చేసిన ప్రభుత్వం




హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయ కుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ నాయ కులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. మిగతా 2లో..

# తెలంగాణలో ముస్లిం సంస్థల సరికొత్త ఉద్యమం

## ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్లు

- బీఫ్ బ్యాన్ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తులు
- సామాజిక, మత సామరస్యాలకు ప్రతీకగా..

తెలంగాణలో ముస్లిం సంఘాలు ఒక సరికొత్త, సానుకూల ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఆవును భారతదేశ జాతీయ జంతువుగా ప్రకటించాలని, బీఫ్ ఎగుమతులు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పోరాటం ఊపందుకుంది. ఈ ఉద్యమం సామాజిక సామరస్యం, సాంస్కృతిక గౌరవం, మతపరమైన సందేశాలను ముందుకు తెస్తోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా తెలంగాణలోని వివిధ ముస్లిం సంస్థలు సమావేశాలు, సంతకాల సేకరణ, ర్యాలీలు నిర్వహిస్తున్నాయి. "ఆవు హిందూ సమాజానికి పవిత్రమైనది. మా మత గ్రంథాల ప్రకారం కూడా ఆవు మాంసం (బీఫ్) హరామ్" అంటూ ఈ ఉద్యమకర్తలు వాదిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ నుంచి మొదలై తెలంగాణలో బలపడుతోంది. బక్రీద్ సమయంలో ఈ డిమాండ్ మరింత ఉధృతమవుతోంది.




కాప్రాలోని ఈద్గా వద్ద గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న ముస్లిం పెద్దలు




హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) : భారత్ ప్రపంచంలో బీఫ్ (ప్రధానంగా బఫెలో మీట్ / కారాబీఫ్) ఎగుమతుల్లో అగ్రగామి దేశాల్లో ఒకటిగా ఉంది. ఇటీవలి డేటా ప్రకారం.. భారత్ ప్రపంచ బీఫ్ ఎగుమతుల్లో 2వ లేదా 3వ స్థానంలో ఉంది (యూఎస్ డీఏ, వివిధ రిపోర్టుల ప్రకారం) సంవత్సరానికి సుమారు 3.2 బిలియన్ (సుమారు రూ. 27,000 కోట్లు) విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూఎస్ఏ తర్వాత భారత్ ప్రముఖ స్థానంలో ఉంది. ఈ ఎగుమతులు మిగతా 2లో..

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల నిర్మాణాలు

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డబుల్ ఇళ్లు నిర్మిస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మే29(జనంసాక్షి): పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం మిగతా 2లో..

## 'క్యూర్' పరిధిలో ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

9లో..

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులెవరు?

- ఇది అత్యంత బాధాకరం
- యూపీపీఎస్సీని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలించారు
- ఎన్టీయేపై సుప్రీం ఆగ్రహం
- 2027 నుంచి ఆన్‌లైన్‌లో నీట్
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్టీఏ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధాన మంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం మిగతా 2లో..

## రిజర్వ్ చేసిన మూడు నెలల్లోనే తీర్పులివ్వండి

హైకోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశాలు

## సెక్స్ వర్కర్లూ మనుషులే..

- వారిపై దాడులు సరికాదు
- ఆ వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి
- సుప్రీం కోర్టు స్పష్టీకరణ

## 'నీట్' లీకేజీ దోషులను వదలం

- వారిని కఠినంగా శిక్షించి తీరుతాం
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

వివరాలు 2వ పేజీలో..

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత



- అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చేశాం: ఇరాన్
- లేదు అదంతా అసత్య ప్రచారమే : అమెరికా

టెహ్రాన్(జనంసాక్షి):ఓ వైపు శాంతి ఒప్పందం కోసం ప్రయత్నాలు జరుగుతుండగా.. అమెరికా– ఇరాన్ మళ్లీ పరస్పర దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల వేళ ఇరాన్ అధికారిక మీడియా కీలక ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని కూల్చేశామని ప్రకటించింది. అయితే, ఈ ప్రకటనను అగ్రరాజ్యం ఖండించింది. అలాం టిది ఏమీ లేదని కొట్టిపారేసింది. శుక్రవారం తెల్లవారుజామున బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్ ప్రాంతంలో శత్రు దేశానికి చెందిన ఓ యుద్ధ విమానాన్ని అడ్డగించినట్లు టెహ్రాన్ మీడియా తెలిపింది. ఇరాన్ వైమానిక దళాలు ఆ ఫైటర్‌జెట్‌ను కూల్చివేశాయని స్థానిక గవర్నం˜ను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా.. లేదా అనే పూర్తి వివరాలను మాత్రం అది వెల్లడించలేదు. ప్రస్తుతం బుషెహర్ ప్రాంతంలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది. మరో వైపు, దాడుల్లో యుద్ధ విమానం కూలిపోతున్న ఓ ఫొటోను ఇరాన్ ఆర్మీ ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అయితే, ఈ వాదనలను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. బుషెహర్ ప్రావిన్స్ సమీపంలో అమెరికా విమానాన్ని కూల్చేశామంటూ ఇరాన్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడింది.

## హర్మూజ్ వద్ద టోల్ వసూలు చేశారో.. జాగ్రత్త!

ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది

మిత్రదేశం ఒమన్‌కు అమెరికా హెచ్చరికలు

# కాటేసిన కల్తీ మద్యం

## 11 మంది మృతి

### ఆందోళనకరంగా పలువురి పరిస్థితి

### పుణె జిల్లాలో విషాదం

**పుణె(జనంసాక్షి):**మరోమారు కల్తీ మద్యం కాటేసింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి-చించ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ మిగతా 9లో..

## తెలంగాణలో ముస్లిం సంస్థల
# సరికొత్త ఉద్యమం

ఆర్థి కంగా లాభదాయకమైనప్పటికీ, సాం స్కృతిక-మతపరమైన కారణాలతో వా టిని నిషేధించాలని ఈ ఉద్యమం డిమాండ్ చేస్తోంది. "ప్రపంచవ్యాప్తం గా అనేక దేశాలు ఆవు సంరక్షణ చట్టాలు అమలు చేస్తున్నాయి. భారత్ కూడా ఆవును జాతీయ జంతువుగా చేసి, బీఫ్ బ్యాన్ విధించాలి" అని ఉద్యమకర్తలు అంటున్నారు. ఈ ఉద్యమం హిందూ-ముస్లిం సామరస్యానికి ఒక కొత్త మార్గం అని చెప్పుకోవచ్చు. రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మంచి స్పందన వస్తోందని వారు వెల్లడిస్తున్నారు. ఈ ఉద్యమం భారతీయ సంస్కృతి రక్షణలో మైలురాయి అవుతుందా? ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

### గోవుకు ప్రత్యేక స్థానం కల్పించాలి : బద్రుద్దీన్

**కాప్రా(జనంసాక్షి):**గోవును జాతీయ జంతువుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా ఈద్గా కమిటీ అధ్యక్షులు మహ మ్మద్ బద్రుద్దీన్ అన్నారు. కాప్రా ఈద్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలతో కలిసి గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనావును గోమాతగా పిలవడం హిందువుల విశ్వాసమని, అన్ని మతాలవారు గౌరవించాలని కోరారు. గోవధను నిషేధిం చేందుకు గోవుకు ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ముస్లిములందరూ ఐక్యంగా కోరుతున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జూన్ 5 తరువాతే
## తెలంగాణకు నైరుతి

గతేడాది మే 24న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు అప్పటి అంచనా కంటే 8 రోజులు ముందే ప్రవేశించాయి. 2025లో మే 26న తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి.ఎల్‌నినో ప్రభావంతో : ఈ ఏడాది వానాకాలం కొంత ఆలస్యంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణను నైరుతి రుతుపవనాలు తాకుతాయని తెలుస్తోంది. భారతదేశ దక్షిణ ప్రాంతాన్ని ఈ నెల 25న తాకుతాయని వాతావరణ శాఖ తొలుత అంచనా వేసినా ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రుతుపవనాల కదలికల్లో వేగం అధికంగా తగ్గింది. ఇప్పటి వరకు హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన పవనాలు శ్రీలంక సగం వరకు వచ్చి ఆగిపోయాయి. ఈ ఏడాది వానాకాలంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే భారత వాతావరణ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాధారణంగా అయితే మే నెల చివరికల్లా తెలంగాణ రాష్ట్రాన్ని రుతుపవనాలు చేరుకోవాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో జూన్ 5వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య రావొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల వర్షాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల ఆలస్యం అలా ఉండగా జూన్ నెలలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ అంచనా వేసింది. మధ్య, వాయువ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా చాలా వరకు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, బిహార్, ఒడిశా, హర్యానా, ఛత్తీస్‌గడ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల వీచే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో కూడా వడగా లుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సముద్ర పరిస్థితులపై డాక్టర్ మృత్యుంజయ్ మాట్లాడుతూ, ప్రస్తుతం తటస్థ ఈఎన్ఎస్ఓ పరిస్థితులు ఎల్‌నినో వైపుగా మారుతున్నాయని తెలిపారు. జూన్ నాటికి ఎలనినో పరిస్థితులు స్పష్టంగా ఏర్పడే అవకాశం 82 శాతంగా ఉందని, జూలై, ఆగస్టు నాటికి 90 శాతానికి పైగా చేరుతుందని అన్నారు. రుతుపవన కాలమంతా తటస్థ హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఐఓడీ) పరిస్థితులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మే నెలలో వర్షపాతం సాధారణం కంటే నాలుగు శాతం ఎక్కువగా నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. మే 27 వరకు నమోదైన మొత్తం రుతుపవన వర్షపాతం సాధారణం కంటే ఒక శాతం అధికంగా ఉందని డాక్టర్ మృత్యుంజయ్ పేర్కొన్నారు. ఈసారి రుతుపవనాలు సాధారణంగా మే 16న అండమాన్ నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయని ఆయన తెలిపారు. వచ్చే వారంలోగా కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లోకి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా వెల్లడించారు.




# సెక్యులర్ ఓట్లపై ఎస్ఐఆర్ కుట్ర

ఎస్ఐఆర్ కోసం అన్ని నియోజకవర్గా ల్లోనూ ఇన్‌ఛార్జ్‌లను నియమించాలి. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను 10 రోజులకోసారి కలుస్తాను. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తా. నాతో సహా అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనా ల్సిందే. బూత్ ఎన్‌రోలర్ల సాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించాం. ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్ గాంధీతో సన్మానం చేయించాం"అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొంటున్నది తెలంగాణే..

నంబర్ వన్‌గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో




కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుం దన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేసా యని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## ఉద్యోగుల బకాయిలు రూ.2వేల కోట్లు విడుదల

అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకా యిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు.ముందస్తు ప్రణా ళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది." ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## పక్కా ప్రణాళికతోనే న్యాయవాది హత్య

**స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియోతో ఢీకొట్టారు**

**ఖాజా మొహిజుద్దీన్ కేసులో వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైకోర్టు న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసును ఛేదించామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. ప్రమాదంలా కనిపించిన ఈ ఘటన వెనుక పక్కా కుట్ర ఉందని.. దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. "ఈ నెల 23న ఉదయం మొహిజుద్దీన్ స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియో వాహనంతో నిందితులు ఢీకొట్టి హత్య చేశారు. వాహనానికి నంబర్ ప్లేట్లు లేకుండా వచ్చి ఢీకొట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించాం. ప్రత్యేక బృందాలతో వారిని అదుపులోకి తీసుకున్నాం. వక్ఫ్ ఆస్తులు, ట్రిబ్యునల్ కేసుల వివాదాలే హత్యకు ప్రధాన కారణంగా విచారణలో వెల్లడైంది. ప్రధాన కుట్రదారుడు ముజాహిద్ ఆలంఖాన్‌ను అరెస్ట్ చేశాం. మొహిజుద్దీన్ హత్య కోసం రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. హరియాణాలోని పానిపట్‌లో కిషన్ అలియాస్ పప్పును అదుపు లోకి తీసుకున్నాం. జనవరి నుంచి న్యాయవాది కదలికలపై నిందితులు రెక్కీ నిర్వహించారు. హత్య కోసం ప్రత్యేకంగా స్కార్పియో వాహనం కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. డ్రైవర్ అభిజిత్ అలియాస్ నాని వాహనం నడిపి హత్య చేసినట్లు గుర్తించాం. నిందితుల నుంచి రూ.10.10 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## హర్మూజ్ వద్ద టోల్ వసూలు చేశారో.. జాగ్రత్త!

- **ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది**
- **మిత్రదేశం ఒమన్‌కు అమెరికా హెచ్చరికలు**

వాషింగ్టన్(జనంసాక్షి):మిత్రదేశమైన ఒమన్‌కు అమెరికా గట్టి హెచ్చరికలు చేసింది. ఇరాన్‌తో కలిసి హర్మూజ్ జలసంధి వద్ద నౌకల నుంచి టోల్ వసూలు చేస్తే.. సహించేది లేదని తేల్చి చెప్పింది. ఒకవేళ అలాంటి చర్యలకు దిగితే.. తమ ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. హర్మూజ్ వద్ద టోల్ వసూలు చేసే విధానాన్ని అమెరికా ఎప్పటికీ సహించదని బెసెంట్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఒమన్ ఇరాన్‌తో కలిసి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇలాంటి చర్యలకు దిగితే.. అమెరికా ఆర్థిక మంత్రిత్వశాఖ వారిని లక్ష్యంగా చేసుకుని ఆంక్షలు విధిస్తుందన్నారు. ఈ హెచ్చరికల అనంతరం.. టోల్ వసూలు చేసే ప్రణాళిక ఏదీ తమకు లేదని ఒమన్ నుంచి స్పష్టమైన హామీ వచ్చినట్లు బెసెంట్ తెలిపారు. ఒమన్ రాయబారితో తాను ఫోన్‌లో మాట్లాడానని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సుంకం విధించే అంశంపై ఎలాంటి ప్రణాళికలు లేవని ఆయన తనతో చెప్పారన్నారు. ఇరుదేశాల మధ్య ఎన్నోఏళ్లుగా ఉన్న సత్సంబంధాలు.. అలాగే కొనసాగించాలని వారు కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

**ఇరాన్‌తో డీల్‌కి సిద్ధం..**

యుద్ధం ముగించే విషయంపై అమెరికా- ఇరాన్‌లు ఒక ఒప్పందానికి చేరువలో ఉన్నాయని స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే, ట్రంప్ ఇంకా దీనిపై సంతకం చేయలేదని తెలిపారు. హర్మూజ్‌లో స్వేచ్ఛా వాణిజ్యం కొనసాగించడం, ఇరాన్ తన వద్ద ఉన్న యురేనియం నిల్వలను అప్పగించడం, అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదనే ట్రంప్ డిమాండ్లను టెహ్రాన్ అంగీకరిస్తే.. ఒప్పందం సాధ్యమవుతుందన్నారు. ఇది పూర్తిగా అధ్యక్షుడి చేతుల్లోనే ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో ఇబ్బందులపై ఆర్థిక మంత్రి మాట్లాడారు. మే నెలలో చమురు ధరలు 10 శాతం తగ్గాయన్నారు. హర్మూజ్ వద్ద 2వేల నౌకలు నిలిచిపోయినట్లు వెల్లడించారు.

## ముగిసిన బండి భగీరథ్ కస్టడీ

**చర్లపల్లి జైలుకు తరలింపు**

హైదరాబాద్(జనంసాక్షి):పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల నిర్మాణాలు

చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వా ణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## ఆస్తి వివాదంలో ఆప్తులను అంతమొందించి..

**బంధువుల మధ్య ఘర్షణలో ఆరుగురి హత్య**

బెంగళూరు(జనంసాక్షి): కర్ణాటకలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తి వివాదంతో జరిగిన ఘర్షణలో ఆరుగురు హత్యకు గురయ్యారు. విజయపుర జిల్లా గోవిందవాడలో ఈ ఘటన జరిగింది. ఓ కుటుంబంలో 10 ఎకరాల ఆస్తికి సంబంధించిన వివాదంలో సమస్య పరిష్కారానికి పంచాయితీ నిర్వహించారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో బంధువులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ప్రత్యర్థి వర్గంపై పథకం ప్రకారం కళ్లలో కారం చల్లి కత్తులతో నరికి చంపేశారు. ఈ ఘటనలో చనిపోయిన వారిలో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. విజయపుర పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి
# బాధ్యులెవరు?

కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

2027 నుంచి ఆన్‌లైన్‌లో నీట్ (యూజీ).. సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్‌టీఏ కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించిన అనంతరం 2027 నుంచి నీట్ (యూజీ) పరీక్షను పెన్ను, పేపర్(పీపీటీ) విధానంలో కాకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించేందుకు తాము పూర్తి సన్నద్ధతతో ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం ముందు దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ విషయాన్ని పేర్కొంది. నీట్ యూజీ పరీక్షను సీబీటీ విధానానికి మార్చాలని నిపుణుల ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసినట్లు పేర్కొంది. ఎన్‌టీఏ నిర్వహించే ప్రధాన పరీక్షల్లో నీట్ ఒక్కటే కేంద్ర ఆరోగ్యశాఖ, జాతీయ వైద్య కమిషన్ విధానాలకు అనుగుణంగా ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని.. మిగతా టెస్టులన్నింటినీ ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది.మరోవైపు, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

### లీకేజీ దోషులను వదలం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోదీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు.11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

### రిజర్వ్ చేసిన మూడు నెలల్లోనే తీర్పులివ్వండి

**హైకోర్టులకు 'సుప్రీం' ఆదేశాలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్ర హైకోర్టుల్లో తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత దానిని వెలువరించేందుకు అత్యధికంగా 3 నెలలు మాత్రమే సమయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టుల్లో తీర్పు రిజర్వు చేసిన తర్వాత కూడా పలు కారణాలతో తీవ్ర జాప్యాలు చోటు చేసుకోవడంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపిన్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పలు అంశాలపైనా హైకోర్టులకు మార్గదర్శకాలు జారీ చేసింది.వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 3 నెలల కంటే ముందే తీర్పులను ఆశిస్తున్నాం.బెయిల్ దరఖాస్తులపై అదే రోజు తీర్పులు ప్రకటించడం ఆదర్శనీయమని.. ఒక వేళ తీర్పు రిజర్వు చేస్తే మర్నాడే దానిని వెలువరించాలి.బెయిల్‌పై తీర్పు వెలువడిన రోజునే జైలు అధికారులకు ఆర్డర్లను వెంటనే పంపించాలి.విచారణలోని ఖైదీలను బెయిల్ లభించిన అదే రోజున.. లేకపోతే మరుసటి రోజున విడుదల చేసేయాలి. ట్రయల్ కోర్టులు నిబంధనలు పాటించిన వెంటనే ఆ విషయాన్ని సంబంధిత రాష్ట్ర హైకోర్టులకు తెలియజేయాలి.తీర్పులో అమలు చేయాల్సిన భాగాన్ని మాత్రమే ఓపెన్ కోర్టులో వెల్లడించాలి. ఇక తీర్పునకు గల కారణాలతో సహా పూర్తికాపీని ఏడు రోజుల్లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.ఈ మార్గదర్శకాలను అమలు చేయడానికి సంబంధిత హైకోర్టుల వెబ్‌సైట్‌లలో ఆయా చీఫ్ జస్టిస్‌ల పర్యవేక్షణలో తగిన మార్పులు చేయాలి.

### సెక్స్ వర్కర్లూ మనుషులే..

న్యూఢిల్లీ(జనంసాక్షి):స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది.




## రైతు డిస్కమ్ పేరుతో ప్రభుత్వ కుట్ర

**దీనితో వ్యవసాయానికి అన్యాయమే**

**డిస్కమ్‌పై పబ్లిక్ హియరింగ్ లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్ (జనంసాక్షి):**రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయంపై ఎండ్రిన్ చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరించారు. తెలంగాణ రైతుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయిబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. 1999 నాటి కాల్పుల ఘటన కొని తెచ్చుకోవద్దురైతు డిస్కమ్ పేరుతో ఈ ప్రభుత్వం పచ్చిదగా చేస్తోందని కవిత అన్నారు. ఈ నిర్ణయం మంచిదే అయితే ఆరు నెలల నుంచి ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని సీక్రెట్ గా ఉంచిందో చెప్పాలన్నారు. ఈఆర్సీ కారణంగా ఈ అంశం బయటకు వచ్చిందే తప్ప ప్రభుత్వం బయటపెట్టలేదని గుర్తు చేశారు. నిజానికి ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీ లో చర్చ పెట్టాలన్నారు. కానీ సీక్రెట్ గా ఇదంతా చేస్తుందంటేనే కచ్చితంగా ఇందులో దురుద్దేశం ఉందన్నది అర్థమవుతుందని కవిత చెప్పారు. రైతులు ఎవరు అడగకుండానే రైతు డిస్కం అవసరమేమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. అసలే డిస్కమ్ ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కమ్ ను కంపెనీ పేరుతో ఎలా రిజిస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు.తెలంగాణ డిస్కమ్ లలో ఆంధ్రావాళ్ల పెత్తనం ఉండొద్దని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టాల్సి వస్తే అందులో తెలంగాణ వాళ్లే ఉండాలని డిమాండ్ చేశారు.

## తోర్నాలలో మరొక తెలంగాణ తోరణ ద్వారం




**చేర్యాల/ధూల్మిట్ట (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా దుల్మిట్ట పరిధిలోని దోర్నాల గ్రామంలో తోరణ ద్వారాన్ని గుర్తించినట్లు నంగునూరుకు చెందిన ఔత్సాహిక చరిత్రకారుడు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ వెల్లడించారు. దోర్నాల అంటే పలుకుబడిలో మారిన సరళాదేశమైన 'తోరణాల' అని చెప్పారు. దోర్నాల(తోరణాల)కు ఆ పేరు రావడానికి కారణమైన 'దర్వాజ బండ' మీద ఒకప్పుడున్న తోరణద్వారమే అనే ఆధారాలను తన క్షేత్ర పరిశోధనలో గుర్తించినట్లు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. తోర్నాల గ్రామం బయట భోగం దాని ఉయ్యాల, లేదా దర్వాజ బండ అని గ్రామ ప్రజలు పిలిచే పరుపుబండ ఉందన్నారు. ఈ బండ మీద ముక్కలై పడివున్న ఒక దర్వాజ(ద్వార బంధం) ఆనవాళ్ళు కనిపిస్తున్నాయన్నారు. వీటిని పరిశీలిస్తే చాలా వెడల్పు, ఎత్తున్న రాతి దర్వాజ ఇక్కడ వుండేదని దానికి తోరణ ద్వారాలకు తామర మొగ్గల వంటి డ్రాప్స్ వంటివి విరిగిపడి ఉన్న రాతి దూలానికి కనిపిస్తున్నాయని చెప్పారు. తోరణ ద్వార బంధం ద్వార శాఖల(శేరెడు)కు కిందివైపు కలశాలు చెక్కి ఉన్నాయని తెలిపారు. అచ్చం ఇదేవిధంగా కొలనుపాక సోమేశ్వరాలయం ముందున్న వారసత్వ శాఖ మ్యూజియం తోరణద్వారానికి కూడా రెండు వైపుల కలశాలు చెక్కివున్నాయని అన్నారు. మరొక తోరణ ద్వారానికి రాజ దర్వాజ అని పేరు ఉందని, తోర్నాలలో తోరణద్వారం అనే ఈ దర్వాజ కూడా తిరిగి నిలబెట్టలేని విధంగా ముక్కలై పడివుందని చెప్పారు.

## పెట్రో ధరలతో ఆటోడ్రైవర్లకు గడ్డు పరిస్థితి



### ధరలు తగ్గించాలని నిరసన ప్రదర్శన

**మంచిర్యాల, మే29 (జనంసాక్షి) :** పెంచిన డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని బీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్ చార్జీలు పెంచడం వల్ల ఆటో డ్రైవర్ల బతుకులు అగమ్య గోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రం ఐబీలో ఆటో కార్మికులతో కలిసి భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఫ్రీ బస్ వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు డీజిల్ ధరలు పెంపుతో ములిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు అయిందన్నారు. సింగరేణి సంస్థకు, ఆర్టీసీ సంస్థకు ఎలాగైతే సబ్సిడీ ఇస్తున్నారో అదేవిధంగా ఆటో కార్మికులకు కూడా డీజిల్ ధరలో రాయితీ కల్పించాలని కోరారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తీసుకునే జీఎస్టీలను తగ్గించి రాయితీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్, అధికార ప్రతినిధి వేల్పుల శంకర్, తాండూరు మండల ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## కాసర్ల పద్మకు కేటీఆర్ నివాళి

- పార్థివ దేహం వద్ద పుష్పాంజలి



**రాజన్నసిరిసిల్ల, మే29 (జనంసాక్షి) :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు. అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళులర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పాగా

- పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ విజయభేరి

**ఛండీగఢ్, మే29 (జనంసాక్షి) :** పంజాబ్ లోని అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించింది. 50 వార్డుల్లో 28 వార్డులు సొంతం చేసుకుంది. దీంతో అబోహర్‌లో బీజేపీ తొలిసారి మేయర్ పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 2027లో కీలకమైన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ గెలుపు బీజేపీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించారు. బీజేపీ 28 వార్డులు గెలుచుకోగా, ఆప్ 20 వార్డులతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ఒక స్థానం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు. కాలిఫోర్నియా ఆఫ్ పంజాబ్'గా అబోహర్‌ను పిలుస్తారు. కిన్నో పండ్ల సాగు, బలమైన వ్యవసాయ ఆదాయం కలిగిన ప్రాంతమిది. ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగిన అర్బన్ సెంటర్లలో ఇదొకటి. ఈ ప్రాంతంలో ఓటర్ల మనోభావాలను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, 2027 ఎన్నికలకు ముందు ఇలాంటి ఫలితం వెలువడంతో ఆసక్తికరమని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీలకు మే 26న ఎన్నికలు జరిగాయి. మోహాలి, బటిండా, అబోహర్, బర్నాలా, కపుర్తాలా, మోగా, బటాలా, పఠాన్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో 7.555 మంది పోటీ చేశారు. ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సాద్‌తో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల చేదు అనుభవాలను చవిచూసిన ఆమ్ ఆద్మీ పార్టీ కు ఎట్టకేలకు ఊరట లభించింది. ఆప్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన పంజాబ్‌లో ఈనెల 26న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు శుక్రవారంనాడు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో ఆప్ ఘనివిజయం సాధించింది. పంజాబ్‌లోని 102 నగర పాలక సంస్థలకు ఈ ఎన్నికలు జరుగగా, వీటిలో 8 మున్సిపాలిటీలు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 19 నగర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,869 వార్డులకు గాను శుక్రవారం రాత్రి వరకు వెలువడిన ఫలితాల్లో 939 వార్డులను ఆప్ కైవసం చేసుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో సగానికి పైగా వార్డులను దక్కించుకుంది. 376 వార్డుల్లో కాంగ్రెస్ గెలిచి రెండో స్థానంలో నిలిచింది. సాద్-189, బీజేపీ-167 స్థానాలు గెలుచుకున్నాయి. బీఎస్పీ 7 వార్డులు దక్కించుకుంది. పంజాబ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించడంపై 'ఆప్' నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈడీ పార్టీ తుడిచిపెట్టుకు పోయిందని అన్నారు. పంజాబ్‌లోని చిన్న వ్యాపారులపై ఎన్నో దాడులు చేసి ప్రజలను వేదించిన ఈడీ పార్టీపై ప్రజలు ప్రతీకారం తీర్చుకున్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు.

# 9వ రోజుకు సరస్వతీ అంత్యపుష్కరాలు



**కాళేశ్వరం, మే 30 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు తొమ్మిదో రోజు ఘనంగా ముగిసాయి. గురువారం సాయంత్రం కాళేశ్వరం విచ్చేసిన విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి శుక్రవారం ఉదయం సరస్వతీ పుష్కర ఘాట్ లో పుణ్య స్థానమాచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించి అభిషేకం నిర్వహించారు. తర్వాత భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో గంగా స్నానం చేసిన మరల గోదావరి స్నానం చేయాలని వేదాలు చెప్పే వని పుష్కరాల కాలంలో గోదావరి ప్రాణహిత అంతర్యామి సరస్వతి నది త్రివేణి సంగమంతో ఈ అంత్య పుష్కరాలు చాలా గొప్పగా ప్రారంభమయ్యాయని అన్నారు. అంత్య పుష్కరాలు చాలా గొప్ప అని తెలిపారు. అతిథులు ఎవరైనా వస్తే గొప్పగా వీడ్కోలు చెబుతామని కర్కాటక రాశిలో గురుడు ప్రవేశించడం యమునా పుష్కరాలు ప్రారంభమయ్యే ముందు రోజు పుష్కరాలు పూర్తి కావడం దీనిని గ్రహించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి చాలా గొప్పగా వేడుకలు చేయాలని నిర్ణయించడం చాలా సంతోషమని తెలిపారు. ఈ ప్రాంత వాసులు మంత్రి శ్రీధర్ బాబు ఇంత అత్యద్భుతంగా కాశీలో హారతులు ఇచ్చే గొప్ప పండితులను రప్పించడం గొప్పగా అలంకరణ చేయడం ఇక్కడ భక్తులు ధన్యాత్ములని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం దేవాలయాన్ని వేములవాడ వలే అభివృద్ధి చేయాలని, బాసర దేవాలయంలాగా చేయాలని సంకల్పించడం ప్రభుత్వం యొక్క గొప్పతనమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గా పనిచేసి పదవి విరమణ చేసి ప్రస్తుతం డా ఎం సి హెచ్ ఆర్డీ వైస్ చైర్మన్, డిజి శాంతి కుమారి శుక్రవారం సరస్వతి ఘాట్ లో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్న ఆమెకు అర్చకులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ ఆమెకు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పుష్కర స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్స్, యూత్ నాయకులు ఉన్నారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి భారీగా తరలివస్తున్న భక్తుల కోసం పుష్కర ఘాట్ వద్ద బాహుబలి సెట్టింగులు ఏర్పాటు చేసిన కే ఎం కె కంపెనీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ 1000 మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో భక్తులకు చల్లని మజ్జిగ అందజేస్తూ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రత మధ్య భక్తులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు కూడా కంపెనీ సేవలను అభినందించారు. కాళేశ్వరంలో గురువారం రాత్రి గాలితో కూడిన వర్షం పడడం వల్ల భక్తుల సౌకర్యార్థం నదిలో వేసిన టెంట్లు కూలడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం కాంట్రాక్టు సిబ్బంది వాటిని సరి చేశారు. శుక్రవారం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఉప్పల స్వప్నకు ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' కార్యక్రమం సినీ, సాంస్కృతిక వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవార్డు వేడుక అమీర్ పేట ఏఏఏ సినిమాస్‌లో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సమాజ సేవా కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్నకు ప్రతిష్టాత్మకమైన 'కళావేదిక ఎన్టీఆర్ సేవా రత్న అవార్డు'ను ప్రదానం చేశారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, మహిళా సాధికారత, సేవా కార్యక్రమాల్లో ఆమె చేసిన కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ఉప్పల స్వప్నను అభినందించారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తున్న ఆమె సేవలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని వక్తలు కొనియాడారు. ఈ సందర్భగా ఉప్పల స్వప్న మాట్లాడుతూ నేను చేసిన సేవలకు గుర్తింపుగా నన్ను గుర్తించి ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డు ప్రదానం చేయడం సంతోషకరం అని ఆమె అన్నారు. ఈ అవార్డ్ తో బాధ్యత మరింత పెరిగిందని ఆమె అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఈ వేడుకలో కళావేదిక నిర్వాహకులు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు, సామాజిక సేవా రంగానికి విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి అవార్డ్ అందజేయడం నిజంగా అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళా వేదిక వారికి అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆయన సూచించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం మరింత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు ఉప్పల స్వప్నకు శాలువాతో సన్మానం చేసి, జ్ఞాపికను అందజేశారు. సభలో పాల్గొన్నవారు ఆమె భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నందమూరి తారక రామారావు మనవరాలు నందమూరి మోహన రూప, సీమంతిని, ఎన్టీఆర్ కుమారుడు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ నందమూరి మోహన కృష్ణ, ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్‌కు చెందిన ప్రసన్న, నటి లయ, భువన రాయవరపు పాల్గొన్నారు.



## సీఎం ప్రజావాణిలో 428 దరఖాస్తులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 226వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 428 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 201, రెవెన్యూ శాఖకు సంబంధించి 33, ఇందిరమ్మ ఇండ్ల కోసం 116, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 75 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

- 80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి
- బిజెపి భరోసా యాత్రలో అసలు విషయాలు గమనించాం
- సిఎం రేవంత్‌కు అధికారులపై పట్టు లేదన్న ఏలేటి



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హమాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపొమ్మని గత సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గద్దెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరి, బుద్ధి మందగించిందని.. అందుకే బీజేపీని విమర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవుల కోసం, సూట్ కేసులు మోయడానికి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ యాత్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారా? అని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. సన్ ఫ్లవర్, శనగలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని.. అందుకు సంబంధించిన కౌంటర్ ఎక్కడ పెట్టారో చూపించాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

## అలామ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ

- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీపీసీసీ ఉపాధ్యక్షులు ముజాహిద్ అలామ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ చేస్తున్నట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి ప్రకటించారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మొయినోద్దీన్ హత్య కేసులో అలామ్ ఖాన్ తో పాటు ఆయన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. ఈ హత్య అంశాన్ని క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించి ఆయనపై కాంగ్రెస్ బహిష్కరణ వేటు వేశామని ఆయన వివరించారు.

## తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

- పాపెసర్ నాగేశ్వర రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు
- మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం
- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక




**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికాడు.



## వానర దాహం...

**వరంగల్ ఈస్ట్, మే 29 (జనం సాక్షి) :** ఓ పక్క నిప్పుల కొలిమిలా ఎండలు మండుతున్నాయి. మరో పక్క వేడిగాలులతో అల్లాడిపో తున్న పరిస్థితి. మనుషులు బయట తిరగ లేక ఇంటికి పరిమితం అవుతున్న సందర్భం మరోవైపు. ఇక పక్షులు జంతువుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. వాటికి కనీసం నీరు దొరకని పరిస్థితి కనిపిస్తుంది. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డు బ్రిడ్జ్ వద్ద గేట్ వాల్ నుండి నీరు వస్తున్న సంగతి గమనించిన ఓ వానరం అక్కడికి చేరింది. తీవ్ర మైన దాహం తో గేటు వాల్ ద్వారా వస్తున్న నీళ్ల ధారను ఆధారంగా చేసుకుని నీళ్లను తాగి ఉపశమనం పొందిన దృశ్యం శుక్రవారం కనిపించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
30 మే 2026

# ఆర్థిక సంక్షోభం దిశగా దేశం

రూపాయి విలువ నిరంతరం పడిపోతున్నది. ఈ సత్యం కేవలం ఆర్థిక పత్రికల శీర్షికలకు పరిమితమైన వార్త కాదు, ఇది ప్రతి మధ్యతరగతి కుటుంబం వంటగదిలో, ప్రతి రైతు పొలంలో, ప్రతి చిన్న వ్యాపారి గల్లాపెట్టెలో ప్రత్యక్షంగా అనుభవమవుతున్న వేదన. ఒకప్పుడు అమెరికన్ డాలర్‌కు నలభై రూపాయలు విలువ చేసిన మన కరెన్సీ నేడు తొంభై దాటిన ప్రయాణం, ఇది కేవలం సంఖ్యల మార్పు కాదు, జాతి ఆత్మవిశ్వాసానికి పడిన దెబ్బ.

రూపాయి పతనానికి కారణాలు ఒక్కటో రెండో కాదు, అవి పరస్పరం అల్లుకున్న సంక్లిష్టమైన జాలం. దిగుమతులు ఎగుమతులను మించిపోయి వాణిజ్య లోటు పెరుగుతూనే ఉంది. ముడి చమురు దిగుమతులకు వెచ్చించే విదేశీ మారకద్రవ్యం ఏటేటా నిల్వలను హరిస్తోంది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మన మార్కెట్ల నుండి నిధులు వెనక్కి తీసుకువెళుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల విధానం మారిన ప్రతిసారీ మన రూపాయి కంపిస్తోంది. ఇవన్నీ బాహ్య కారణాలు. కానీ అంతర్గత బలహీనతలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.

భారతదేశం విదేశీ మారకద్రవ్య నిల్వలు ఒకప్పుడు ఆరు నెలల దిగుమతులకు సరిపడా ఉండేవి. ఇప్పుడు ఆ స్థిరత్వం అంతటా కనిపించడం లేదు. రిజర్వ్ బ్యాంకు రూపాయిని సంరక్షించే ప్రయత్నంలో నిల్వలను ఖర్చు చేస్తోంది. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అసలు వ్యాధికి చికిత్స చేయకుండా లక్షణాలను అణచడం ఇది ఆర్థిక నిర్వహణలో పైపై మెరుగులు అద్దడం మాత్రమే అవుతుంది. ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో నేతలు విఫలమయ్యారు. తయారీ రంగం బలహీనంగా ఉంది. సేవా రంగం మాత్రమే ఆర్థిక వ్యవస్థను నెట్టుకొస్తోంది. కానీ అది ఎంతకాలం సరిపోతుంది? సాఫ్ట్‌వేర్ ఎగుమతులు, ప్రవాస భారతీయుల డబ్బు పంపుళ్ళు ఇవే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ ఊపిరితిత్తులు అయ్యాయి. ఇది సుస్థిర స్థితి కాదు.

సంపాదకీయం

జనంసాక్షి

**రాజకీయ నాయకత్వం ఎన్నికల లాభాల కోసం దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలను పణంగా పెట్టడం ఇప్పుడు కొత్తేమీ కాదు. రాయితీల పేరిట కొట్టుమిట్టాడే ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం మోపడం, ఉత్పాదక పెట్టుబడిని పక్కనపెట్టి వినియోగ వ్యయాన్ని పెంచడం, ఇవి తాత్కాలిక జనాదరణ కొనుగోలు చేసే ఉపాయాలు మాత్రమే. దీర్ఘకాలంలో ఇవి ద్రవ్యోల్బణాన్ని రేకెత్తిస్తాయి, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి, రూపాయి స్థిరత్వాన్ని ప్రమాదంలో పడేస్తాయి.**

పెట్రోల్ ధరలు పెరిగినప్పుడు రూపాయిపై నెపం వేయడం, వడ్డీ రేట్లు అధికమయినప్పుడు అంతర్జాతీయ పరిస్థితులను తప్పు పట్టడం, ఇది అధికారపక్ష స్వభావంగా మారింది. కానీ ప్రజలు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు: పరిస్థితులను అంచనా వేసి ముందుగానే చర్యలు తీసుకోవడమే నాయకత్వం కాదా? నిరాశ మాత్రమే ఈ సంపాదకీయం సందేశం కాదు. పరిష్కారాలు లేవని కాదు, అమలు చేసే సంకల్పం లేదన్నది నిజం. ఎగుమతి ప్రోత్సాహం కోసం దీర్ఘకాలిక విధానాలు అవసరం. దేశీయ తయారీ రంగాన్ని పునరుద్ధరించే సమగ్ర పారిశ్రామిక విధానం రావాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకర్షించే వాతావరణం నిర్మించాలి.

రిజర్వ్ బ్యాంకు ద్రవ్య విధానం మరియు కేంద్ర ప్రభుత్వ రాజకోషన్య విధానం మధ్య సమన్వయం పెరగాలి. ద్రవ్యోల్బణ నియంత్రణ మరియు వృద్ధి సాధన మధ్య సమతుల్యత సాధించడమే ఇప్పుడు అత్యవసరం. ఇది కఠినం కానీ అసాధ్యం కాదు. రూపాయి పతనం కేవలం ప్రభుత్వ విఫలత మాత్రమే కాదు ఇది మొత్తం జాతి ముందున్న సవాలు. పొదుపు అలవాట్లు, దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత, అనవసర విదేశీ వస్తువుల దిగుమతి తగ్గించడం వీటిలో సామాన్య పౌరుల పాత్ర కూడా ఉంది. అదే సమయంలో ప్రతినిధులను జవాబుదారీగా నిలబెట్టడం, పారదర్శకమైన ఆర్థిక నిర్వహణను డిమాండ్ చేయడం ఇవి ప్రజాస్వామ్య బాధ్యతలు. రూపాయి నానాటికీ పతనమవుతోందని మనం నిట్టూర్చడం మాత్రమే చేస్తే మన పిల్లల భవిష్యత్తు కూడా నానాటికీ దుర్భరమవుతుంది. ఈ చేదు నిజాన్ని ఎదుర్కోవడానికి ఈ దేశపు ప్రజలూ, నాయకులూ సిద్ధంగా ఉన్నారా? అదే ఇప్పుడు అసలైన ప్రశ్న.

# తెలంగాణ ఉద్యమం – మేథో మదనం

తెలంగాణ ఉద్యమ చరిత్ర అనగానే కేవలం బహిరంగ సభలు, పొలిటికల్ మైలేజ్ మాత్రమే పైకి కనిపిస్తాయి. కానీ ఆ ప్రజా సెంటిమెంట్‌ను క్షేత్రస్థాయి పాలనా విధానాలుగా మార్చిన నిగూఢ మేథోమథనం ఒకటుంది. 2005 నుండి 2014 వరకు సుమారు పదేళ్ల పాటు బిఎస్ రాములు. ్షహించిన మేథో మదనం అజ్ఞాతంగానే ఉండిపోయింది.

తెలంగాణ తల్లి రూప కల్పన అందులో ఒకటి మాత్రమే. తొలి బీసీ కమిషన్ చైర్మన్‌గా నేను చేసిన ప్రయాణం ఆ మేథోమథనానికి ఒక అధికారిక రూపం. నాడు సుదీర్ఘ అంతర్గత చర్చల్లో ప్రతిపాదించి రూపకల్పన చేసిన ఐదు కీలక అంశాలు నేడు తెలంగాణ సామాజిక చిత్రపటాన్ని మార్చేశాయి. సూచనలు ఆలోచనలు మాత్రమే మావి. అమలు పరిచిన కీర్తి కెసిఆర్ కే దక్కుతుంది.

జనంసాక్షి

**బహుజన విద్యకు పటిష్ఠ పునాది – గుర్తుల పాఠశాలల ప్రతిపాదన:**

ఉమ్మడి రాష్ట్రంలో బహుజన (ఎస్సీ, ఎస్టీ, బీసీ) విద్యార్థులు ఎదుర్కొంటున్న వివక్షను అడ్డుకోవడానికి కేవలం స్కాలర్‌షిప్‌లు ఇస్తే సరిపోదని, వారికి అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన "ఉచిత వసతి విద్య" అందించాలని 1990 నుంచి వందల ప్రసంగాల్లో నేనే ప్రధాన మంత్రినైతే ఒక్క రూపాయి అదనపు పన్ను వేయకుండా దేశంలోని బాల బాలికలందరికి ఉచిత గురు విద్య 16 ఏళ్ల పాటు అనగా డిగ్రీ పీజీ దాకా ఉచిత వసతి , భోజనం, ్ష్ణ్యమైన విద్య అందిస్తాను అని చెప్పే వాడిని. తెలంగాణ ఉద్యమంలో ఈ మాట కేసీఆర్ ను కూడా ఆకర్షించింది. అలా వెయ్యి రెసిడెన్షియల్ స్కూల్లు కాలేజీలు వెలిసాయి. ఐదు లక్షల మంది బాల బాలికలు నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్య నందుకొని చరిత్ర సృష్టిస్తున్నారు. ఈ ఘనత కేసీఆర్ దే. నా ఉదాత్త ఆశయం ఏమంటే సంక్షేమ శాఖల అధ్వర్యంలో కాలేజీలతోపాటు యూనివర్సిటీలు కూడా నెలకొల్పి నడపడానికి బడ్జట్ పెంచాలి. . భవిష్యత్తులో ఇది దేశవ్యాప్తంగా అమలు ్ణతుందనే నా విశ్వాసం.



**పేదవాడి ఆత్మగౌరవం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నమూనా**

అంతకుముందు ప్రభుత్వాలు ఇచ్చిన 'ఇందిరమ్మ ఇళ్లు' పేదవాడిని అప్పులపాలు చేసే చిన్న పెంకుటిళ్లుగా ఉండేవి. ఒక పేదవాడు సమాజంలో తలఎత్తుకుని జీవించాలంటే హాల్, రెండు పడక గదులు, వంటగది, మరియు రెండు టాయిలెట్లతో కూడిన 'గౌరవప్రదమైన ఇల్లు' అవసరం. వెయ్యి చదరపు అడుగుల డబుల్ బెడ్రూంలా, 200 గజాల స్థలంలో కట్టడం. సగం సబ్సిడీ పై అందజేయడం, ఇంటి ముందు రెండు బర్లు, ఇంటి వెనక వంద వనరాజ కోళ్లు పెంపకంతో సగం ఆదాయం పెరుగుతుంది అనేది ఉన్నతాశయం. అంత స్థలం కష్టం అని పూర్తిగా ఉచితంగానే ఇవ్వాలనే చర్చలతో రూపొందిన డబుల్ బెడ్రూంలు వేలాది మంది పేదల సొంతింటికా కలని సాకారం చేసాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రైతులు బాగు పడుతారు. భూమి లేని పేదలకు కూడా అంతే బడ్జట్ కెటాయించి ఇండ్లు కట్టివ్వాలనేది నా డిమాండు. ఒక సంవత్సరం బడ్జట్ కేటాయించారు ప్రాధాన్యతల్లో మార్పులు వచ్చాయి

**అస్తిత్వ ఆవిష్కరణ – 'తెలంగాణ తల్లి' విగ్రహ రూపకల్ప**

ఉమ్మడి పాలకుల సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి స్వీయ అస్తిత్వం ఉండాలని మనకంటూ ఒక బలమైన అస్తిత్వ చిహ్నం కావాలని భావించాం. తెలంగాణ భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా, ఇక్కడి బహుజన శ్రమశక్తిని మరియు బతుకమ్మ, బోనాలు, జొన్న కంకులను మేళవిస్తూ 'తెలంగాణ తల్లి' రూపకల్పనపై మేము గంటల తరబడి చర్చించాం రూపం, ఆభరణాలు, చేతిలో జొన్న కంకి, మరియు తెలంగాణపౌరుషాన్ని ప్రతిబింబించేలా ఆనాటి చర్చల్లో రూపుదిద్దుకున్న ఆ నమూనానే... నేడు కోట్లాది మంది తెలంగాణ ప్రజల గుండెల్లో, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పూజలందుకుంటున్న అధికారిక 'తెలంగాణ తల్లి' విగ్రహం.

**అస్తిత్వ చైతన్యం – 'తెలంగాణసంబరాల' వ్యూహం**

ఉద్యమం కేవలం రాజకీయ నినాదాల చుట్టూ తిరిగితే ప్రజలు ఎక్కువ కాలం కనెక్ట్ కాలేరని... మన పండుగలను, భాషను, వంటలు , అప్పాలు, , పండుగల తీరొక్క వంటలు సంస్కృతిని వేడుకలుగా మార్చాలని మేము భావించాం. ఇందులో భాగంగానే 'తెలంగాణ సంబరాలు' నిర్వహించాలనే ప్రతిపాదనను తెచ్చాము. బతుకమ్మ, బోనాలు పండుగలను రాష్ట్ర పండుగలుగా ప్రకటించి, నిధులు కేటాయించి అధికారిక సంబరాలుగా మార్చడం వెనుక నాటి ఆంతరంగిక చర్చల వ్యూహమే కారణం. ఇది తెలంగాణ సమాజంలో తిరుగులేని సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని తెచ్చింది.

**భవిష్యత్ యువతరానికి శిక్షణ, ఢిల్లీ వేదికగా పోరాటాలు**

తెలంగాణఉద్యమానికి భావజాలపరమైన బలాన్ని చేకూర్చడానికి 'యువకులకు తెలంగాణ చరిత్ర, వనరుల దోపిడీపై శిక్షణ తరగతులు' నిర్వహించాలని ప్రతిపాదనలు చేయడం జరిగింది.. అలాగే, కేవలం రాష్ట్రంలో కొట్లాడితే సరిపోదని, ఢిల్లీ పీఠాన్ని కదిలించడానికి "చలో ఢిల్లీ" వంటి జాతీయ స్థాయి నిరసన కార్యక్రమాలను రూపాంతీకరించాలని భావించాము. ఈ ప్రతిపాదనల వల్లే వేలాది మంది యువకులు మేథోపరమైన చైతన్యంతో ఉద్యమంలోకి వచ్చారు. 'చలో ఢిల్లీ' కార్యక్రమాలు జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించి, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడానికి అవసరమైన లాబీయింగున సాధ్యం చేసాయి.

గురుకులాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తెలంగాణ తల్లి రూపం సాంస్కృతిక పోరాటాలు బహుజన సమాజ సంక్షేమం కోసం సాగిన కృషిలో ఇవి కొన్ని. మరో వ్యాసంలో.. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో సాగిన పదేళ్ల (2014 – 2023) పాలన తెలంగాణ ఆధునిక చరిత్రలో అత్యంత కీలకమైనది. ఒక ఉద్యమ నాయకుడిగా రాష్ట్రాన్ని సాధించి, ఆపై ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ పాలనను మేథోపరంగా, సామాజిక–ఆర్థిక కోణాల్లో విశ్లేషిస్తే ఎన్నో విజయాలు. నూతన చరిత్ర సృష్టించి దేశానికి దిశా నిర్దేశం చేసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు వ్యాసాల్లో రాయడం పుస్తకాలుగా తీసుకు రావడం జరిగింది.



బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త
8331966987

# కమ్యూనిస్టుల ఐక్యతకై కృషి చేద్దాం!

1967 మే 25న జరిగిన మహత్తర నక్సల్బరీ గిరిజన రైతాంగ పోరాటం, సమాజంలో విప్లవాత్మక పరివర్తన దిశగా భారత ప్రజలు చేసిన సుదీర్ఘ, రాజీలేని ప్రయాణంలో ఒక భాగం. నక్సల్బరి నిప్పురవ్వ నాటి నుండి నేటి వరకు రగులుతూనే ఉన్నది. వివిధ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించటం లేదు. సంక్షేమ సంస్కరణ వాద విధానాలతో పాలకవర్గాల తమ చావును వాయిదా వేసుకుంటూ వస్తున్నాయి. నక్సల్బరీ రైతాంగ ఉద్యమం యొక్క రాజకీయ ప్రాముఖ్యత ఏమిటంటే, అది అప్పటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), కమ్యూనిస్టు ఉద్యమం ఉద్యమం వర్గ సంకర విధానానికి,సంస్కరణవాదం వైపు దిగజారిపోవడాన్ని బహిర్గతం చేసింది. నక్సల్బరీ పోరాటం భారత కమ్యూనిస్టుల విప్లవాత్మక పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేసింది. భారత విప్లవోద్యమ పంథా పై సుదీర్ఘ చర్చ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్టు యోధాన యోధులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, చం ద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరుల నాయకత్వాన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గొప్ప సిద్ధాంత చర్చ జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొద్దిమంది మినహా మిగతా వారంతా మార్చిస్ట్ పార్టీ నాయకత్వం పై నుంచి కింది దాకా మొత్తం ఈ నలుగురిని అనుసరించారు. ఈ నలుగురు నాయకత్వాన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని భరద్వాన్ ప్లీనం లో ఈ నలుగురి తరుపున కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఎనిమిది గంటలపాటు సిద్ధాంత ఉపన్యాసాన్ని అనర్గళంగా ఇచ్చారు. భారత కమ్యూనిస్టు యోధాన యోధులైనటువంటి పుచలపల్లి సుందరయ్య కార్యదర్శిగా మాకినేని బసవపున్నయ్య జ్యోతిబసు, బీటీ రణధీర్ రామ్మూర్తి లాంటి యోధాన యోధులు వీరి సిద్ధాంతం రాపిడికి, వరవడికి తట్టుకోలేకపోయారు. బృహత్తరమైనటువంటి సిద్ధాంత చర్చలో ఒకవైపు సాగుతుండగా చారు మజుందారు నాయకత్వాన అతివాద పంథాలో దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థ పైన అసంతృప్తి ఉన్నటువంటి యువతను సరైన పంథాలో నడపటం సాధ్యపడలేదు. అట్టి పరిస్థితిలో 1969లో సీపీఐ (ఎంఎల్) ఏర్పాటుకు దారితీసింది. అయినప్పటికీ, ఇది మళ్ళీ అనేక సంకుచిత, అవకాశవాద చీలికలకు కారణమైంది. అందువల్ల, భూమి కోసం, భుక్తి కోసం సామాజిక విముక్తి కోసం నక్సల్బరీ నినాదం నెరవేరలేదు. అయినప్పటికీ, దోపిడీ, అన్యాయం లేని సమాజ స్థాపన కోసం జరిగిన వీరోచిత ప్రజా పోరాటాలైన మహా నక్సల్బరీ పోరాటాన్ని భారతదేశ రాజకీయ పటం నుండి చెరిపివేయడంలో పాలక వర్గాలు, ఫాసిస్టులు చేసే ఏ ప్రయత్నమూ సఫలం కాలేదు! ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ మాటను గుర్తు తెచ్చుకుందాం.

తెల్లవాడు నాడు నిన్ను భగత్ సింగ్ అన్నాడు, నల్లవాడు నేడు నిన్ను నక్సలైట్ అన్నాడు, ఎల్లవారు రేపు నిన్ను ఎగుచుక్క అంటారు.

ఫాసిస్టు మోడీ, అమిత్ షా మావోయిస్టు నిర్మూలన పేరుతో భారత రాజ్యాంగాన్ని విస్మరించారు. చత్తీస్గడ్,జార్ఖండ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బడుగు జీవుల గురించి, హరిజన గిరిజనుల గురించి ఆలోచిద్దాం.

నక్సల్బరీ అమరవీరులకు మన హృదయపూర్వక, విప్లవాత్మక నివాళులు అర్పిద్దాం! మార్క్సిజం అజేయం. మార్క్సిజం– లెనినిజం–మావో ఆలోచన విధానం వర్ధిల్లాలి. సూత్రబద్ధమైన కమ్యూనిస్టు ప్లవకారుల ఐక్యతను కోరుకుందాం. అందుకొరకై కృషి చేద్దాం.

మన్నవ హరిప్రసాద్
పోలిట్ బ్యూరో సభ్యుడు,
సిపిఐ (ఎమ్.ఎల్) రెడ్ స్టార్
82477 28296



# బహుజన తెలంగాణలో ఆధిపత్య ప్రతీకలా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కేవలం పరిపాలనా విభజన కోసం కాదు. అది దశాబ్దాల పాటు సాగిన ప్రాంతీయ అస్తిత్వ యుద్ధం. ఆంధ్ర ఆధిపత్య రాజకీయాలు, వనరుల దోపిడీ, ఉద్యోగాల్లో అన్యాయం, తెలంగాణ భాష–సంస్కృతుల అవమానీకరణకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. వందలాది మంది విద్యార్థులు, యువత తమ ప్రాణాలను అర్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు"స్వయం పాలన – స్వాభిమానం" తెలంగాణ ఉద్యమానికి మూల కేంద్రంగా నిలిచాయి. అలాంటి తెలంగాణలో ఇప్పుడు హైదరాబాద్ మైత్రివనం వద్ద నంద మూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయడం మరోసారి తెలంగాణ అస్తిత్వ రాజకీయాలపై తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. ఇటీవల జూబ్లీ హిల్స్ ఎన్నికల గెలుపు అధికార పార్టీ ఈ హామీ ఇవ్వడం జరిగింది. మొన్న రవీంద్రభారతి ముందు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు విషయంలో పలువురు తెలంగాణ కవులు, కళాకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఆంధ్ర ఆధిపత్య సాంస్కృతిక ప్రతీకలను ముందుకు తేవడాన్ని వారు ప్రశ్నించారు. అయినప్పటికీ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలను పక్కన పెట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఇది కేవలం ఒక సినీ–రాజకీయ నాయకుల విగ్రహం వ్యవహారం కాదు, తెలంగాణ ఉద్యమ ఆత్మను పాలకులు గౌరవిస్తున్నారా? లేక మళ్లీ ఆధిపత్య రాజకీయాల పునరుద్ధరణకు వేదిక సిద్ధం చేస్తున్నారా? అనేది తెలంగాణ మేధావుల ప్రశ్న.

**బీసీ,ఎస్సీ, ఎస్టీ ప్రజల ఆత్మగౌరవం ఏది?**

తెలంగాణ ఉద్యమ సమయంలోనే ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ చరిత్రకు సంబంధం లేని విగ్రహాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. "మిలియన్ మార్చ్" రూపంలో తెలంగాణ యువత తమ ఆవేదనను చరిత్ర ముందు ఉంచింది. ఎందుకంటే తెలంగాణ ప్రజలు తమ చరిత్రకు, తమ అమరవీరులకు, తమ భాషకు, తమ సాంస్కృతిక అస్తిత్వానికి గుర్తింపు కోరుకున్నారు. దశాబ్దాల పాటు తెలంగాణ గొంతును అణచివేసిన ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగానే ఆ ఉద్యమం సాగింది. ఇప్పుడు అదే తెలంగాణలో మళ్లీ ఆంధ్ర రాజకీయ ప్రతీకలను ప్రతిష్ఠించడం ప్రజల్లో అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. ఎన్టీఆర్ గొప్ప నటుడు, తెలుగు రాజకీయాల్లో ప్రభావశీల నాయకుడు అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు సినీ రంగానికి, రాజకీయాలకు ఆయన చేసిన సేవలను ఎవరూ తిరస్కరించలేరు. కానీ ప్రశ్న ఏమిటంటే తెలంగాణ రాష్ట్రంలో ఆయనను రాజకీయంగా మళ్లీ పునర్జీవింపజేయడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని రాజకీయ ప్రాధాన్యంతో ఏర్పాటు చేయడం సహజంగానే ప్రాంతీయ ఆత్మగౌరవ ప్రశ్నను మళ్లీ ముందుకు తెస్తోంది. ఇది నిజంగా తెలంగాణ ప్రజల భావోద్వేగాల ప్రతిబింబమా? లేక ఆధిపత్య సామాజిక వర్గాల ఓటు బ్యాంకు రాజకీయాల కోసమా? అనే ప్రశ్న తీవ్రంగా వినిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఆంధ్ర పెట్టుబడిదారులు, సెటిలర్ల ఓట్లను ఆకర్షించేందుకు జరుగుతున్న రాజకీయ ఎత్తుగడగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజల విముక్తి, ఆత్మగౌరవం కంటే ఎన్నికల లెక్కలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**రాజకీయ పార్టీలన్నీ మౌనం!**

మొన్న ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఈరోజు ఎన్టీఆర్ విగ్రహం విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు మౌనం పాటించడం ఆందోళన కలిగించే విషయం. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంటుంటే, బీజేపీ మరియు బీఆర్ఎస్ కూడా పెద్దగా వ్యతిరేకించడం లేదు. అంటే మూడు ప్రధాన పార్టీలు తెలంగాణ సబ్బండ వర్గాల ఆత్మగౌరవ రాజకీయాల కంటే ఆంధ్ర, తెలంగాణ ఆధిపత్య రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని నిర్ధారణ అవుతుంది. ఈ క్రమంలో తెలంగాణ వచ్చిన తర్వాత కూడా బహుజన వర్గాల ఆశలు, ఆకాంక్షలకు తగిన విలువ దక్కడం లేదనే విమర్శ రోజు రోజుకూ బలపడుతోంది. రాష్ట్రం ఏర్పడినా పాలనా వ్యవస్థలో, రాజకీయ పార్టీలలో, ఆర్థిక వనరుల పంపిణీలో ఇప్పటికీ అగ్రకుల పార్టీల, అగ్రకుల నాయకుల ఆధిపత్యమే కొనసాగుతోంది. తెలంగాణ ఉద్యమాన్ని భుజాన మోసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఇంకా అధికార అంచుల్లోనే నిలబెట్టబడ్డాయి. తమకు భూమి, సంపద, అధికారంలో ప్రాతినిధ్యం పెరుగుతుందని, ఆత్మగౌరవానికి గుర్తింపు లభిస్తుందని ఆశించారు. కానీ నేడు స్వరాష్ట్ర పరిపాలనలోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ, సాంస్కృతిక ప్రతీకలలోనూ అదే ఆధిపత్య వర్గాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఇదంతా చూస్తుంటే "తెలంగాణ ఉద్యమం అంతా కూడా ఆంధ్ర అగ్రవర్ణాల స్థానంలో తెలంగాణ అగ్రవర్ణాల పరిపాలించడానికి జరుగుతున్న ఒక రాజకీయ ఎత్తుగడ అని 2009లో బీసీ ఎస్సీ, ఎస్టీల జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్న మాటలు ముమ్మాటికి నిజం అనిపిస్తుంది. నిజమైన తెలంగాణ అంటే --- భూమిపై హక్కు, సంపదలో వాటా, అధికారంలో ప్రాతినిధ్యం, సంస్కృతికి గౌరవం దక్కాలి. ఈ నాలుగు లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చినా బహుజనులకు స్వరాజ్యం రాలేదన్న మాట నిజమవుతుంది. అందుకే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీల జాక్ ఆధ్వర్యంలో సమస్త రంగాల్లో అట్టడుగు వర్గాల రాజ్యాంగ హక్కుల కోసం "మా భూమి"రథయాత్ర కొనసాగుతుంది. తెలంగాణ అట్టడుగు అణగారిన వర్గాల విముక్తి పోరాటం ఇదీ.



మూడు ప్రధాన పార్టీలు తెలంగాణ సబ్బండ వర్గాల ఆత్మగౌరవ రాజకీయాల కంటే ఆంధ్ర, తెలంగాణ ఆధిపత్య రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని నిర్ధారణ అవుతుంది. ఈ క్రమంలో తెలంగాణ వచ్చిన తర్వాత కూడా బహుజన వర్గాల ఆశలు, ఆకాంక్షలకు తగిన విలువ దక్కడం లేదనే విమర్శ రోజు రోజుకూ బలపడుతోంది.

సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
7989579428



# సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో అవకతవకలు

దేశంలో విద్యా వ్యవస్థ అంటే ఒకప్పుడు నమ్మకం, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రతీకగా భావించేవారు. ముఖ్యంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరీక్షలను అత్యంత ప్రమాణాలతో నిర్వహించే వ్యవస్థగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉండేది. కానీ ఇటీవల సంవత్సరాల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న ప్రశ్నాపత్రాల లీకులు, మూల్యాంకనంలో లోపాలు, ఫలితాల ఆలస్యం, సాంకేతిక వైఫల్యాలు, విద్యార్థుల మానసిక ఒత్తిడి, అసమానతల ఆరోపణలు వంటి పరిణామాలు ఈ వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థలోనే గందరగోళం, అవ్యవస్థ, నిర్లక్ష్యం చోటుచేసుకోవడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ఇది కోట్లాది విద్యార్థుల జీవితాలతో జరుగుతున్న ప్రమాదకర ప్రయోగంగా మారింది.

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై వచ్చిన విమర్శల్లో ప్రధానంగా ప్రశ్నాపత్రాల భద్రత అంశం పెద్ద చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లలో పదేపదే పేపర్ లీక్ ఆరోపణలు రావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పరీక్షలకు నెలల తరబడి కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్ష రోజు తమ కృషి విలువ కోల్పోతుందనే భయంతో మానసికంగా కుంగిపోతున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నాపత్రాలు ముందుగానే వైరల్ అవుతున్నాయనే వార్తలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. ఈ పరిస్థితి పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. ఒక దేశంలో అత్యున్నత విద్యా బోర్డు కూడా ప్రశ్నాపత్రాలను రక్షించలేకపోతే, ఆ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రజలు ఎలా నమ్మకం ఉంచగలరు అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇక మూల్యాంకన విధానంలో ఉన్న లోపాలు విద్యార్థులను మరింత అసహనానికి గురిచేస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు తాము బాగా రాసినా అనుకున్న మార్కులు రాకపోవడం, రీ–వాల్యుయేషన్ తర్వాత భారీ తేడాలు బయటపడడం వంటి ఉదాహరణలు తరచూ కనిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులకు ఒకే సమాధానానికి వేర్వేరు మార్కులు రావడం, అంతర్గత మార్కుల విషయంలో పాఠశాలల మధ్య అసమానతలు ఉండడం విద్యా వ్యవస్థలో సమానత్వం లేదనే భావనకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రతిభకు నిజమైన గుర్తింపు దక్కడం లేదని అనేక మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




డిజిటల్ యుగం పేరుతో కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో సాంకేతిక వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి అమలులో ఉన్న లోపాలు విద్యార్థులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఫలితాల విడుదల సమయంలో అధికారిక వెబ్‌సైట్లు పనిచేయకపోవడం, అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడం, సర్వర్లు క్రాష్ అవడం వంటి సమస్యలు ప్రతి సంవత్సరం పునరావృతమవుతున్నాయి. దేశాన్ని "డిజిటల్ ఇండియా"గా మార్చుతున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రాథమిక సాంకేతిక సదుపాయాలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సాంకేతికతను విద్యార్థుల సౌలభ్యం కోసం కాకుండా ప్రచార సాధనంగా మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జనంసాక్షి

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్, విధానాల్లో తరచూ మార్పులు చేయడం కూడా మరో పెద్ద సమస్యగా మారింది. ఒక సంవత్సరం ఒక విధానం, మరో సంవత్సరం మరో విధానం అమలు చేయడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. సిలబస్ తగ్గింపు, పరీక్షా నమూనా మార్పులు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానాల్లో అనిశ్చితి విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. విద్యా విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత వెనుకబడుతున్నారు. నగరాల్లో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం ఈ మార్పులకు తక్షణమే అనుగుణంగా కోచింగ్ వ్యవస్థలను సిద్ధం చేసుకుంటూ లాభపడుతున్నాయి. దీంతో విద్యా రంగంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్ తర్వాత విద్యార్థుల మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల ఒత్తిడి, మార్కుల పోటీ, ప్రవేశ పరీక్షల భయం వల్ల విద్యార్థుల్లో ఆందోళన, నిరాశ, ఆత్మహత్యల ప్రవణత పెరుగుతున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థులకు కౌన్సెలింగ్ సదుపాయాలు, భావోద్వేగ సహాయం, పరీక్షా ఒత్తిడి నిర్వహణ వంటి అంశాల్లో సరైన చర్యలు కనిపించడం లేదు. విద్యను మానవీయ దృక్పథంతో చూడకుండా కేవలం ర్యాంకులు, శాతాలు, పోటీ మార్కెట్ కోణంలోనే ప్రభుత్వం చూస్తోందనే విమర్శలు బలపడుతున్నాయి.

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో ప్రైవేటీకరణ ప్రభావం కూడా పెరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోచింగ్ సెంటర్ల ఆధిపత్యం, కార్పొరేట్ పాఠశాలల వ్యాపార ధోరణి వల్ల సాధారణ కుటుంబాలకు విద్య భారం అవుతోంది. పరీక్షల విధానం కూడా కోచింగ్ ఆధారితంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులు, పేద కుటుంబాల పిల్లలు, ప్రాంతీయ భాషా మాధ్యమ విద్యార్థులు ఈ పోటీలో వెనుకబడుతున్నారు. సమాన విద్యా అవకాశాలను కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

విద్యార్థుల నిరసనలు, తల్లిదండ్రుల ఆందోళనలు, విద్యావేత్తల విమర్శలు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తరచూ సమస్యలను చిన్నచూపు చూస్తోందనే భావన ఉంది. తప్పిదాలు జరిగినప్పుడల్లా "దర్యాప్తు చేస్తాం", "వ్యవస్థను బలోపేతం చేస్తాం" అనే ప్రకటనలు అయితే వస్తున్నాయి కానీ, ఆచరణలో పెద్ద మార్పులు ఏమీ కనిపించడం లేదు. బాధ్యత వహించాల్సిన అధికారులు అరుదుగా మాత్రమే జవాబుదారీతనం స్వీకరిస్తున్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, సమానత్వం లేకుండా కేవలం ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల విశ్వాసాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వ్యవస్థపై సమాజం ప్రశ్నించాల్సిన సమయం ఇది. లేకపోతే పరీక్షల భయం మాత్రమే కాదు, మొత్తం విద్యా వ్యవస్థపైనే యువత నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

## గ్రామీణ నీటి వనరుల పరిరక్షణలో ఉపాధిహామీ పనులు కీలకం



**బిజినేపల్లి, మే 29 (జనం సాక్షి) :** ఉపాధి హామీ పథకం పనులను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని హేమంత్ కేశవ్ పాటిల్, అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం బీజినపల్లి మండల కేంద్రంలోని కానుగల కుంట చెరువులో కొనసాగుతున్న పూడికతీత ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ ప్రశక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న పనుల పురోగతి, పనుల్లో పాల్గొంటున్న కూలీల సంఖ్య, రోజువారీ పనితీరు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పూడిక తొలగింపు పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు. పనులకు హాజరవుతున్న ప్రతి కార్మికుడికి సమయానికి వేతనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. చెరువుల పూడికతీత ద్వారా భూగర్భ జలాల మట్టాలు పెరగడంతో పాటు సాగునీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని, గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయాభివృద్ధికి ఉపాధి హామీ పనులు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు మేలు చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి
- నారాయణపేట జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా
- జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక



**నారాయణపేట, మే 29 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అల్పాహారము, కిట్టు విద్యార్థులకు అందజేయడం అభినందనీయంమనితెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. పిఅర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి పిఆర్టియుటిఎస్ నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2025 -26 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని ప్రభుత్వ అన్ని యాజమాన్యంలోని ప్రతి పాఠశాల మొదటి, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఈ ఫలితాలు సాధించుటకు కృషిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందమును మెడల్స్, సర్టిఫికెట్, మెమొంటోలతో ఘనంగా జిల్లా కేంద్రంలోని అంజన గార్డెన్‌లో పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి అధ్యక్షతన సన్మానించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మన జిల్లా ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు.విద్యాశాఖ చాలా కీలకమైన శాఖ అని అందుకే ముఖ్యమంత్రి గారు తన దగ్గరే ఆ శాఖను ఉంచుకొని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ఎప్పటికప్పుడు చేసేలా చూస్తున్నారని అన్నారు.ఇప్పటికీ ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావలసిన పి.ఆర్.సి, డిఏలు, పెండింగ్ బిల్లులుల వంటి సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాను అన్నారు. విద్యార్థులు కలెక్టర్, డాక్టర్ అవుతాము అనడమే కాకుండా ఉపాధ్యాయుడుగా పనిచేస్తానని అనుకోవాలని అందుకు ప్రయత్నం చేయాలనీ,ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైనదని భవిష్యత్తు తరాలను తయారు చేస్తుందని కొనియాడారు. అదే విధంగా ఈ కార్యక్రమం చాలా అద్భుతమైనదని కితాబు ఇస్తూ జిల్లా కలెక్టర్ కి పిఆర్టియు ఆధ్వర్యంలో అవార్డు పొందిన ఇద్దరు విద్యార్థుల ఫ్లెక్సీలను తయారుచేసి అన్ని పాఠశాలల్లో పెట్టాలని వాటిని స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులు పిఆర్టియు అవార్డు తీసుకోవడానికి ఉత్సాహంతో చదివేలా ప్రేరణ కలిగించాలని సూచించారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాకు ప్రత్యేకంగా విద్యా వాలంటీర్లను తీసుకొని రావడానికి కృషి చేస్తానని అన్నారు.జిల్లా లో సాగునీటి కోసం చేపడుతున్న నిర్మాణాలలో రైతులకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వ నివ్వని విధంగా ఆరు రెట్లు నష్టపరిహారము అందజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో విద్యార్థుల నమోదుకు మరియు గుణాత్మక విద్యకు ఉపాధ్యాయులు కృషి చేస్తూ ఉండాలని వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తాను అన్నారు జిల్లాలో అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతున్నాయని వాటినరికట్టడానికి అందరూ సహకరించాలని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో నాలుగైదు పాఠశాలలు 100% ఫలితాలు సాధిస్తే కేవలం నేడు ఒక్క నారాయణపేట జిల్లాలోనే 38 పాఠశాలలు 100% సాధించడము అభినందనీయమని, అదే విధంగా ప్రతి పాఠశాలలోని విద్యార్థులను ఉపాధ్యాయులను ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న జిల్లా శాఖను అభినందిస్తూ పలు ఉపాధ్యాయ సమస్యల మీద మాట్లాడారు ప్రత్యేకంగా తాను ఎమ్మెల్సీ అయినప్పటి నుండి 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధనకు మొట్టమొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు అతి త్వరలోనే అది సాకారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి,ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేతా సత్య యాదవ్,జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎం.నర్సింహా రెడ్డి,పి ఆర్ యు టి ఎస్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి గౌరవాధ్యక్షులు తిరుపతి మాజీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్ రావు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ జిల్లా సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## బ్యాలెట్లు భద్రపరచిన గోడౌన్ తనిఖీ

- భద్రత విషయంలో నిర్లక్ష్యం వద్దు
- వరి ధాన్యం తరలించడానికి సహకరించండి
- లారీ ఓనర్ అసోసియేషన్ నాయకులకు కలెక్టర్ సూచన



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయము పరిధిలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారము పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ అధికారులు, నేమత్ హాలి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు రవాణాపై వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమావేశమయ్యారు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటా చారి , జిల్లా అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు.వరి కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ధాన్యం తరలింపులో ఎదురవుతున్న సమస్యలు, వాహనాల లభ్యత, రవాణా ఛార్జీలు, సమయపాలన తదితర అంశాలపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన వరిని సరిపోవు వెహికిల్ లను ఏర్పాటు చేసి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.రవాణా ప్రక్రియలో సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని వెహికిల్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ధాన్యం నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రాల్లో ఉండకుండా తక్షణమే తరలింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తాండూర్, కొడంగల్ మండలాలో వాహనాలను ఏర్పాటు చేసివరి కొనుగోలు లో లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో తాండూర్ డి ఆర్ ఓ అనిత,డి ఆర్ డి ఓ శ్రీనివాస్,ట్రాన్స్ పోర్ట్ అధికారి సురేందర్ రెడ్డి, జి ఎం మహేశ్వర్,సివిల్ సప్లై అధికారులు మోహన్ కృష్ణ, సుదర్శన్, అధికారులు, మిల్లర్లు, వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సెన్సస్‌ను వేగవంతం చేయాలి




**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** జనగణన 2027 లో భాగంగా మొదట ఈ ఏడాది చేపట్టిన ఇండ్ల గణనను జూన్ 9వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 2.18 లక్షల ఇండ్లు ఉండగా ఇప్పటివరకు ఎన్నుమరేటర్లు దాదాపు 1.79 లక్షల ఇళ్ల గణన పూర్తి చేశారని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. చార్జ్ అధికారులుగా ఉన్న తహసిల్దార్ లు, తమ పరిధిలోని సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లతో తరచూ మాట్లాడుతూ జిల్లాలో 95 శాతానికి పైగా హౌస్ లిస్ట్ ఆపరేషన్ జరిగేలా కృషి చేయాలన్నారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని, ఇతర భూ సంబంధ సమస్యలను కూడా అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాలోని రేషన్ దుకాణాలను సంబంధిత మండలాల తహసిల్దార్లు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు.అలాగే పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా ఉంచాలని, అవకతవకలకు పాల్పడే రేషన్ డీలర్లు,సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్,మేనేజర్ విమల, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీల వ్యర్థాలతో భూ గర్భ జలాలు కలుషితం

- రోజు వారి సరఫరా లో అంతరాయమే
- న్యాయం కోసం కాలనీ వాసుల మోర



**బోడుప్పల్, మే 29 (జనంసాక్షి) :** కోట్ల రూపాయలు వెచ్చించి ఇండ్లు కొనుక్కుంటే తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాము. ఇంట్లో ఉన్న బోరు వాడుకుందామంటే చుట్టూ పక్కన ఉన్న భూ గర్భ జలాలు కలుషితం కావడంతో వాడుకోవడానికి కూడా ఇబ్బందికరంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ లోని తిరుమల మెడోస్ కాలనీ వాసులు వాపోతున్నారు.శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కు పిర్యాదు చేయడానికి వచ్చిన కాలనీ వాసులు మీడియాతో మాట్లాడుతూ నాడు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బోడుప్పల్ నగరంలో ఇళ్ళు తీసుకుంటే హైదరాబాదు నగరానికి అనుకూలంగా ఉంటుందని భావించం కానీ నేడు అక్కడి పరిస్థితులను చూస్తే ఎందుకు ఇక్కడ ఇళ్ళు కొనుగోలు చేశామా అని బాధపడుతున్నామని వాపోయారు.ఇండ్ల చూట్టూ కంపెనీలు అ కంపెనీల నుండి వచ్చే విష వాయువులను పీల్చడం ద్వారా రోగాలు వస్తున్నాయి అంతే కాదు పలు కంపెనీలు ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోకపోవడం వలన డ్రైనేజీ వాటర్ ను విచ్చలవిడిగా వదలడంతో భూ గర్భ జలాలు కలుషితం కావాడం జరిగింది దాంతో బోరు వాటర్ విపరీతమైన దుర్వాసన, రంగు మారి వస్తున్నాయి దీనిపై గత రెండు సంవత్సరాల నుండి అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మాకు ఏలాంటి ఉపశమనం కలగడం లేదని కాలానికి చెందిన మహిళలు సరితా,బాగ్య,కవితా, బాగ్య,లక్ష్మీ లు వాపోయారు.అంతే కాకుండా ప్రస్తుతం మంచినీటి సరఫరా కూడా ఇబ్బందిగా ఉందని నీటి సరఫరా లేక బోరు నీళ్ళు వాడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు త్వరగా స్పందించాలని కోరారు.

## నకిలీ జీఓలతో ప్రభుత్వ భూముల అక్రమ విక్రయానికి యత్నం

- ముగ్గురు నిందితుల అరెస్ట్



**రాజేంద్రనగర్, మే 29 (జనంసాక్షి) :** గండిపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెం.18లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు క్రమబద్ధీకరించి కేటాయించినట్లు చూపిస్తూ నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓలు) సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన కేసులో సైబరాబాద్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. శుక్రవారం శేర్లింగంపల్లి సైబరాబాద్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 23న గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.990/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మొత్తం ఐదు నకిలీ జీఓ కాపీలు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి బ్యాంక్ పాస్‌బుక్స్, ఎంఓయూ పత్రాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు.దివంగత దశరథ్ కుటుంబ సభ్యులు గండిపేట్‌లోని సుమారు 10 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిపై తమ హక్కు ఉన్నట్లు పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, 2025 అక్టోబర్‌లో ఆ పిటిషన్లు కొట్టివేయబడ్డాయి. అయినప్పటికీ నిందితులు ఇతరులతో కలిసి ఎకరాకు రూ.3.5 కోట్ల చొప్పున భూమిని విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో సుమారు రూ.4 కోట్లు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నకిలీ భూ పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు సృష్టించి భూమిని తమ పేర్లపై కేటాయించినట్లు తప్పుడు ప్రచారం చేసినట్లు తేలింది. ఈ కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయి కిరణ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. మరికొంత మంది నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రభుత్వ ఉత్తర్వులు, భూ పత్రాలను ధృవీకరణ లేకుండా నమ్మవద్దని, భూముల కొనుగోలు ముందు రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖల వద్ద రికార్డులు తప్పనిసరిగా పరిశీలించాలని డిసిపి సూచించారు.

## పాత గుర్తునే కేటాయించాలి

- జలమండలి కామ్ గార్ యూనియన్
- కొత్త గుర్తు కేటాయింపు నిరసనగా కార్మిక శాఖ కార్యాలయం వద్ద నిరసన



**ముషీరాబాద్, మే 29 (జనం సాక్షి) :** జిహెచ్ఎంసి వాటర్ వర్క్స్ ఎన్నికల్లో ఓడిపోతామనే దృక్పథంతోనే కాంగ్రెస్ అధికార బలంతో ఐఎన్టియుసి తమ గుర్తుని తప్పించి, దుచ్చర్యకు పాల్పడడం సిగ్గుచేటని బి ఆర్ టి యు అనుబంధ సంస్థ కామ్ గర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు నారాయణ లు ఆరోపించారు. గత నాలుగు దఫాలుగా జిహెచ్ఎంసి వాటర్ వర్క్స్ ఎన్నికల్లో బాణం గుర్తుపై తమ యూనియన్ పోటీ చేసి గెలిచిందని,ఈ ఎన్నికల్లో ఓటమి భయంతో తమకు చక్రం గుర్తుని కేటాయించడం పట్ల శుక్రవారంచిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయంలోని లేబర్ కమిషనర్ అధికారి ఆఫీస్ ముందు బేటాయించి బిఆర్టియు అనుబంధ సంస్థ కామ్ ఘర్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేసిన క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో చిక్కడపల్లి పోలీసులు జోక్యం చేసుకొని కామ్ గర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబుతో పాటుగా నిరసనకారులను చిక్కడపల్లి ఏసీపి జి.రణవీర్ రెడ్డి, సీఐ మల్లేశం నేతృత్వంలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కుతరలించారు. అనంతరంఅసోసియేట్ అధ్యక్షుడు నారాయణమీడియాతో మాట్లాడుతూ వెంటనే తమ గుర్తును తమకు కేటాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిహెచ్ఎంసి , సెక్రటేరియట్ తో పాటు సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎల్లమయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ మేడ్చల్ శ్రీనివాస్, లక్ష్మీనారాయణ,వెంకటేష్, అడ్వైజర్ లక్ష్మణ్ కుమార్ మరియు, ఖలీల్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిపై అనుచిత వాఖ్యలు సరికాదు



**బెజ్జంకి, మే 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలను తక్కువ చేసి మాట్లాడటం రసమయి అహంకారానికి నిదర్శనమని అన్నారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో నియోజకవర్గంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్,రైతులకు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తోందని,సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తుంది అని అన్నారు.రైతులను తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేయవద్దని రసమయి బాలకిషన్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,మాజీ దేవాలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్,రొడ్డ మల్లేశం, శానగొండ శ్రవణ్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకటి రాములు,బోనగం రమేష్,ఎలిగే సతీష్,ఇష్కిల్ల ఐలయ్య,అడుకాని నర్సింగం,పుర్మ నారాయణ రెడ్డి,ఐలేని మహేందర్ రెడ్డి,గుబిరే కిషన్,బిగుళ్ల రాజు,జేరిపోతుల మోహన్ బాబు,లింగాల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




**చేవెళ్ల, మే 29 (జనంసాక్షి) :** మహిళా సంఘాలకు రుణాలు ఇస్తూ మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణ మహిళా సమాఖ్యలకు రుణాల మంజూరు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధికి చెందిన 15 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల విలువైన డ్వాక్రా రుణాల చెక్కులను మహిళా లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలే యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు రుణాలు ఇస్తూ మహిళలను కోటేశ్వరులను చేయడమే మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహిళల సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అంతరం మున్సిపల్ చైర్ పర్సన్ చైర్ పర్సన్ సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 99 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాల బలోపేతానికి, వారి జీవనోపాధి మెరుగుపరచడానికి ఈ రుణాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మహిళలు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని వివిధ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ కమీషనర్ బి.యాదగిరి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు మాత్రమే రుణాలను ఉపయోగించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాములు, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, కౌన్సిలర్లు సుచితా బల్వంత్ రెడ్డి, కళ్యాణి యాదగిరి మాధవి యాది రెడ్డి, కుర్వ మంగమ్మ మల్లేష్, డప్పు సువర్ణ, పైండ్ల మధుసూధన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, దూత మల్లేష్ తాళ్లపల్లి నరసింహులు, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పట్టణ మహిళా సమాఖ్య ప్రతినిధులు శ్రీలత, బాలరాజు, పురపాలక అధికారులు రాఘవేందర్, మెప్మా సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల మహిళలు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలతో ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్



**బిజినేపల్లి, మే 29 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం ఉదయం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు బోనాసి జ్యోతి శిరీష, గౌరమ్మల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని నాణ్యత ప్రమాణాలతో ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబం గౌరవప్రదమైన జీవనం గడపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాన్ని సమయానికి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అంతేకాకుండా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల పరిస్థితిని కూడా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తాసిల్దార్ మునీరుద్దీన్,ఎంపీడీవో కథలప్ప,డిప్యూటీ తాసిల్దార్ రవికుమార్, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ.మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, హౌసింగ్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకు గంతలతో వివోఏల నిరసన



**చిన్నశంకరంపేట, మే 29 (జనం సాక్షి) :** చిన్న శంకరంపేట ఐకెపి కార్యాలయం ఎదుట వివో ఏలు సమ్మె లో శుక్రవారం కళ్ళకు గంతలు కట్టుకొని విన్నూత నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. తాము అయిదారేళ్ల నుండి వివో ఏలుగా అతి తక్కువ గౌరవ వేతనంపై పనిచేస్తున్నామని కనీసం 18 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, స్వప్న, లత, యాదగిరి, లావణ్య, నాగా గౌడ్ ,అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలి



**వీపనగండ్ల, మే 30 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి గోదాంలోకి వెంటనే పంపించాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం కంటికి కనిపించడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి మహబూబ్ పాషా మాట్లాడుతూ రైతుల కొనుగోలు విషయంలో ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అధికారులు సమీక్షలకే తప్ప ఆచరణలో పెట్టడం లేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. అనేకసార్లు ఉన్నతాధికారుల ముందు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోతుందన్నారు.ఈ మధ్యకాలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు పందించిన వరి ధాన్యం తడిసిన రైతులు నష్టపోకుండా తక్షణమే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు ధాన్యాన్ని గోదాములకు తరలించాలని డిమాండ్ చేశారు.ఆందోళనకారుల దగ్గరికి చిన్నంబావి ఎస్ఐ,పోలీసులు చేరుకొని వీపనగండ్ల ఎమ్మార్వోతో చరవాణి ద్వారా మాట్లాడి సమస్యను వివరించగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ఎం.ఆది, ఆశన్న,నక్క ఈశ్వర్, రవి ప్రసాద్,పెద్ద ఖాజా,వెంకటేశ్వర్ గౌడ్, రామకృష్ణ, నవీన్, రైతులు అశోక్,మహేష్,కురుమయ్య, కానమోని రాముడు,గోవిందు, రాముడు, ఎల్లయ్య, వెంకటేష్, భగవంత్, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, సంక్షేమమే ధ్యేయం

- రూ.80 లక్షలతో పాఠశాల భవనానికి శంకుస్థాపన
- అరబిందో ఫార్మా సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ బడుల అభివృద్ధి
- భూమిపూజ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



**జడ్చర్ల, మే 29 (జనంసాక్షి) :** పేద విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా జడ్చర్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు శరవేగంగా సాగుతున్నాయి. బాదేపల్లి పాతబజార్ హరిజనవాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక బాధ్యత నిధులు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ లబ్ధిదారులకు 25 సీఎంఆర్ఎఫ్ చెక్కులను, మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థలు తమ లాభాల్లో 2 శాతం నిధులను సామాజిక బాధ్యత కింద విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అరబిందో ఫార్మా సంస్థ రూ.4 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే బాదేపల్లిలో రూ.80 లక్షలతో కొత్త భవనం, ఉరుకొండ మండలం గుడిగానిపల్లిలో రూ.1.20 కోట్లతో మరో పాఠశాల భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అమ్నియల్, హెటిరో ఫార్మా సంస్థల సహకారంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తూ.. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తాము వేగంగా పూర్తి చేస్తున్నామని, వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా 'స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం, చిల్లర రాజకీయాలకు నేను దూరం. గతంలో నా కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాంపరింగ్ చేసి నీచ రాజకీయాలకు పాల్పడ్డారు" అని మాజీ ఎమ్మెల్యేపై అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. కార్యక్రమాల్లో జడ్చర్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మండల విద్యాధికారి మంజులాదేవి, అరబిందో ఫార్మా కంపెనీ డి.జి.ఎం జనార్ధన్ రెడ్డి, ఎ.జి.యం. (సి.ఎస్.ఆర్) ఆరుట్ల నరసింహ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి



**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. శుక్రవారం ధరూరు మండలం భీంపురం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతను పరిశీలించి ఎప్పటికప్పుడు తూకం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జీలకు సూచించారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపిఎంఎస్ ను ఆన్లైన్లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో ధరూరు తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది, తదితరులున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అన్ని వసతులు



**మునిపల్లి, మే 29 (జనం సాక్షి) :** అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న చిన్నారుల కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని అంగన్వాడి సూపర్వైజర్ నాగమణి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 లో భాగంగా శుక్రవారం మునిపల్లి మండలంలోని బుదేరా కాలనీ అంగన్వాడి కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ... అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న చిన్నారుల కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. తల్లిపాలు బిడ్డకు పూర్తిగా సేయస్కరమని ఆమె తెలిపారు. డబ్బాపాలకన్నా తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని అన్నారు.ఆరోగ్యవంతమైన బిడ్డ కోసం తల్లిపాలు అదనపు పోషకాహారం అన్నారు. 0-6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని, 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాల్సి ఉంటుందని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. తమ తమ పిల్లలను ముందుగా అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని కోరారు. సమావేశంలో బుదేరా ఉప సర్పంచ్ ఇస్మాయిల్, నందు, అంగన్వాడి ఉపాధ్యాయురాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## రైతుల పేరుతో బీఆర్ఎస్ రాజకీయం

- దిగుబడి పెరగడంతోనే ధాన్యం కొనుగోలులో జాప్యం
- ధాన్యం కొనుగోలును పరిశీలించిన రాజిరెడ్డి



**వెల్దుర్తి, మే 29 (జనం సాక్షి) :** రైతుల పేరుతో బి ఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తుందని రైతులకు వెన్నంటు ఉండి ధాన్యం తరలించడంలో సహకరించాలి కానీ రైతులనుగేసి రోడ్డుపైకి తెచ్చి కాలయాపన చేస్తూ రాజకీయం చేస్తూ ధర్నాలు నిరసనలు వ్యక్తం చేయడం సరికాదని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతం సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ధాన్యం దిగుబడి పెరగడంతో కొనుగోలు జాప్యం జరుగుతుందని దీన్ని ఆసరా చేసుకొని ప్రతిపక్ష పార్టీ అయినా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులకు సహాయం చేయాల్సింది పోయి రైతులను రోడ్డుపైకి ఈడ్చి బి ఆర్ఎస్ కార్యకర్తలతో రోడ్డుపై బైఠాయించి ధర్నాలు నిరసన వ్యక్తం చేయడం సమయసం కాదని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. అకాల వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాంలో నిల్వచేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న గోదాంలను ధాన్యం కొనుగోలు కోసం వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మే 29 (జనం సాక్షి) :** ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై శుక్రవారం హైదరాబాదు నుంచి అదనపు ముఖ్య ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ ఓటర్లు జాబితాను ముద్రించి, ప్రకటించాల్సి ఉందన్నారు. ఎన్నుమరేషన్ ఫామ్ లను ఓటర్లకు ఇచ్చిన తర్వాత ప్రతి ఇంటినీ సంబంధిత బిఎల్ఓలు మూడుసార్లు సందర్శించి, వారిచ్చే డిక్లరేషన్ కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ సరిగ్గా పనిచేయని బిఎల్వోల స్థానంలో కొత్త వారి నియామకం చేపట్టాలన్నారు. సంబంధిత మండలాల తహసీల్దారులు తమ పరిధిలోని సూపర్వైజర్లు, బిఎల్ఓ లతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు జోగులాంబ గద్వాల జిల్లాలో 78.52 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, గద్వాల మండలం లో చాలా తక్కువ మ్యాపింగ్ జరిగినందున వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,వివిధ మండలాల తహసిల్దారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పని చేస్తాం



**పెబ్బేరు, మే 29 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లా పెబ్బేర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఇటీవల జరిగిన మండల, పట్టణ అధ్యక్షుల నియామకాలపై హర్షం వ్యక్తం చేస్తూ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మరియు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి సమన్వయంతో పెబ్బేర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా రామ్ రెడ్డి(యాపర్ల), పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా కొంతం దయాకర్ రెడ్డిని నియమించినట్లు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ కోసం నిత్యం కష్టపడి పనిచేసే నాయకత్వానికి బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మండల, పట్టణ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నూతన అధ్యక్షులకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అలాగే నూతనంగా ఎన్నికైన ఇద్దరు అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రతి కార్యకర్తను చైతన్యపరుస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత శక్తివంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఈ పదవులకు తమను ఎంపిక చేయడంలో సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ పెద్దలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయాన్ని సాధించేలా పూర్తి స్థాయిలో శ్రమిస్తామని స్పష్టం చేశారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ప్రెస్ క్లబ్ లోఏర్పాటు చేసిన తొలి విలేకరుల సమావేశంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కూడా పాల్గొని రామ్ రెడ్డి, దయాకర్ రెడ్డిలకు మిఠాయిలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత మగ్గాలను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ వీధిలో గల చేనేత సహకార సంఘం (లిమిటెడ్) కార్యాలయంలో చేనేతే మగ్గాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికు లు ఏ విధంగా మగ్గాలను నేస్తున్నారు..? వారికి రోజువారీ కూలీ ఎంత చెల్లిస్తున్నారని చేనేత జౌళి శాఖ అధికారి బాబును అడి గి తెలుసుకున్నారు. మగ్గంపై ఓ చేనేత కార్మికురాలు నేస్తున్న కాటన్ చీరను ఆమె పరిశీలించారు. చేనేత కార్మి కుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.అలాగే జిల్లాలో ఉన్నటువం టి మొత్తం సంఘాల కు,చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా ఏ ఏ పథకాలు అమలు జరుగుతు న్నాయని ఏ డీ ని ప్రశ్నించ గా నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా, క్లస్టర్ డెవలప్మెంట్,స్కీములు ,క్యాష్ క్రెడిట్, వ్యక్తిగత రుణాల మాఫీ చేనేత కార్మికులకు వర్తిస్తుందని ఏ డీ బాబు కలెక్టర్ కు వివరించారు. నేత కార్మికులు చేతితో నేసిన నారాయణపేట కాటన్ చీర ను జిల్లా కలెక్టర్ కొనుగోలు చేశారు.

## హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కడుపులోనే పసికందు మృతి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 29(జనంసాక్షి ):** కాగజ్‌నగర్ ప్రజాలైఫ్ కేర్ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కడుపులోనే పసికందు మృతి మృతి చెంఇంది. పసికందు మృతికి కారణమైన హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవేగం గ్రామానికి చెందిన గర్నూలే నిర్మల (24) ఈనెల 26 రాత్రి 8 గంటలకు పురటి నొప్పులతో బాధపడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా లైఫ్ కేర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. రెగ్యులర్ డాక్టర్ బాట్లు లేకపోవడంతో ఇన్చార్జ్ డాక్టర్ అయిన దివ్య పురిటి నొప్పులతో బాధపడుతున్న నిర్మలను నార్మల్ డెలివరీ చేస్తానంటూ నమ్మించి వేరే ఆసుపత్రికి వెళ్ళనివ్వకుండా నిర్మలను ఆసుపత్రిలో చేర్చుకోవడం జరిగింది. సరైన వైద్యం అందించక 15 గంటలు నిర్లక్ష్యం చేసి కడుపులోని పసికందు మృతికి కారణమైంది. ఈ సంఘటనతో బాధిత కుటుంబం తమకు న్యాయం జరిగేలా చూడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ ను ఆశ్రయించారు. ఆయన తక్షణమే స్పందించి కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారు. సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పసికందు మృతికి కారణమైన కాగజ్నగర్ పట్టణంలోని ప్రజా లైఫ్ కేర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా వైస్ చైర్మన్ మొహలే దత్త, గురునులే శంకర్, చౌరే మహేష్, దుర్గం పవన్ తదితరులున్నారు.

## వరుస దొంగతనాల ముఠా అరెస్ట్

- 8 మంది నిందితుల రిమాండ్... దొంగిలించిన సొత్తు రికవరీ



**మంగపేట మే 29(జనంసాక్షి) :** మండలంలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఎనిమిది మంది సభ్యుల దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) శ్రీనివాస్, స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి, శ్రీకాంత్ లు వెల్లడించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు టివిఆర్ సూరి, శ్రీకాంత్‌లు కేసు వివరాలను వెల్లడించారు. గంపోనిగూడెం, కమలాపురం, బోర్ నర్సాపూర్‌లలో చోరీలు పోలీసుల కథనం ప్రకారం.. గంపోనిగూడెం, కమలాపురం, బోర్ నర్సాపూర్ గ్రామాల్లో గత కొంతకాలంగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు శుక్రవారం నిందితులను పట్టుకున్నారు. అరెస్టయిన నిందితులు కమలాపురం గ్రామానికి చెందిన నిమ్మల వినయ్, పరమాత్ముల శివ, బోయ పరశురాం, రాయరాకుల సారయ్య, నిమ్మల కుమార్, భూక్య ప్రవీణ్, ఏటూరు నాగారం మండలానికి చెందిన మహమ్మద్ బుజ్జిగిరి, తాడువాయి మండలానికి చెందిన బండి తరుణ్ లను అరెస్టు చేసినట్టు తెలిపారు. అనంతరం వీరి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో బంగారం 15 గ్రాములు, వెండి 40 తులాలు, నగదు 10,000 వేల రూపాయలు, 3 ద్విచక్ర వాహనాలు, 30 కేజీల కాపర్ వైర్, 3 సెల్ ఫోన్లు లను రికవరీ పోలీసులు చేసినట్లు తెలిపారు. ఈ ముఠాకు పాత నేరచరిత్ర ఉందని ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. గతంలో వీరు కొత్తగూడెం, నిజామాబాద్, మంగపేట తదితర ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించారని, జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారని విచారణలో తేలింది. ఈ సందర్భంగా వరుస దొంగతనాల కేసును చాకచక్యంగా ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసిన మంగపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్,ఎస్సై టివిఆర్ సూరి, ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుళ్లు రమేష్, మోహన్, ప్రసాద్, నరేష్, మోహన్‌లను జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఏఎస్పీ మనన్ భట్, ఏటూరు నాగారం సీఐ శ్రీనివాస్ లు ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందాం


- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, మే 29 (జనం సాక్షి) :** రాజకీయాలకు అతీతంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుం దామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్టేషన్ ఘనపూర్ మున్సి పాలిటీ సర్వసభ్య సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజర య్యారు.ఈ సందర్భంగా మున్సి పాలిటీ కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన ఎండి. రహీమున్నిసా, ఎండి. మాషుఖ్, బూర్ల లత, గన్ను నర్సింహులు లకు మున్సిపల్ కమిషనర్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నూతన కో ఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ల సంఖ్య కో ఆప్షన్ సభ్యులతో కలిపి 18నుండి 22కు పెరి గిందని అన్నారు.కొత్తగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యు లకు కౌన్సిల్ లో ఓటు వేసే హక్కు తప్ప కౌన్సిలర్ల కు ఉండే అన్ని హక్కులు ఉంటాయని తెలిపారు. కౌన్సిలర్లకు,నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యు లకు జూన్ 15వరకు ఒక్కో వార్డుకు 10లక్షలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. వెంటనే మీమీ వార్డులలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కి మున్సిపల్ ఎన్నికల జరగక ముందే 50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అలాగే 8 కోట్ల జనరల్ ఫండ్ ఉందని తెలిపారు. ఒకప్పుడు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితినుండి ఇప్పుడు దాదాపు 60 కోట్ల నిధులతో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఉందని వెల్లడించారు. ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తూ రాజకీయాలకు అతీతం గా ఘనపూర్ మున్సిపాలిటీని అభివృద్ధిచేసుకుం దామని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ పుట్టినరోజు సందర్భం గా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేక్ కట్ చేయించి శు భాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మున్సిప ల్ కమిషనర్ రాధాకృష్ణ,వైస్ చైర్మన్ నీల రాజమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ మోసం

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**హనుమకొండ ప్రతినిధి మే 29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో మాత్రం శూన్యమే కనిపిస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం పరకాల,నడికూడ మండలాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులతో కలిసి హనుమకొండలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల దుస్థితి, పార్టీ పరిస్థితులపై ,సభ్యత్వ నమోదు కార్యక్రమంపై,ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటి అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిరోజూ కొత్త మాటలు చెబుతున్నారే తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. పజాపాలన పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అసలు ప్రజల సమస్యలపై కనీస చిత్తశుద్ధి చూపడం లేదన్నారు.

## ఓటర్ జాబితాలో కాంగ్రెస్ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- బూతు లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకం : డీసీసీ అధ్యక్షులు ఇనగాల




**ఆత్మకూర్, మే 29 (జనం సాక్షి):** హనుమకొండ పరకాల నియోజకవర్గ పరిధిలోని గుడేప్పాడ్ క్రాస్ రోడ్స్ లో గల ఎన్ ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్స్ శిక్షణా కార్యక్రమం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య , హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయూబ్ , టిపిసిసి పరకాల నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ పులి అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ కావ్య పాల్గొని మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించుటలో కాంగ్రెస్ ముఖ్యపాత్ర వశిస్తుందని తెలిపారు హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరై, బూత్ లెవెల్ ఏజెంట్లకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలని తెలిపారు ప్రక్రియపై సుదీర్ఘంగా దిశా నిర్దేశం చేశారు ప్రతి ఒక్క అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాకుండా, తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 25, 2026 నుండి ప్రారంభించబోయే 'ప్రత్యేక సమగ్ర సవరణ' గడువులను, నిబంధనలను కూలంకషంగా వివరించారు జూన్ 25, 2026 నుండి జూలై 24, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటినీ కనీసం 3 సార్లు సందర్శించాలని.. ఈ సమయంలో బి.ఎల్.ఎ లు స్థానికంగా ఉంటూ ఎన్యూమరేషన్ ఫారమ్ పంపిణీ సేకరణను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జూలై 31, 2026న ముసాయిదా జాబితా విడుదలవుతుందని, ఆ జాబితాలో అర్హుల పేర్లు ఉన్నాయా లేదా అనేది బి.ఎల్.ఎలు తనిఖీ చేయాలని సూచించారు. జూలై 31, 2026 నుండి ఆగస్టు 30, 2026 వరకు కొత్త ఓటర్ల నమోదు (ఫారమ్-6), చిరునామా మార్పులు సవరణల (ఫారమ్-8) కొరకు దరఖాస్తులను దాఖలు చేయడంలో ప్రజలకు సహాయం చేయాలని, అక్టోబర్ 01, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని ఏజెంట్లకు డీసీసీ అధ్యక్షుల కీలక సూచనలు చేశారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను నేరుగా voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పూర్తి చేయవచ్చని, ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఒకే ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు కాకుండా చూడటం, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్ళిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించేలా బూత్ స్థాయి అధికారులకు సహకరించాలన్నారు. అక్టోబర్ 01, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతీ యువకుడిని గుర్తించి ఫారమ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేయించాలని స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, మాజీ అధ్యక్షులు కమలాపురం రమేష్, ఆత్మకూరు యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, పరికరాల వాసు, అల్వాల రవి, పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 29 (జనంసాక్షి) :** మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాలలో భాగంగా శు క్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, అధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణ సదుపాయాల ద్వారా వివిధ వ్యాపారాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ధి పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, వారు ఆర్జించిన లాభాల నుంచి కొంత శాతం సంఘాల ఖాతాలలో పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరికి సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, కమిటీ సభ్యులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని, పిల్లలు హాజరు శాతం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## ఫామ్ ఆయిల్ తోట దగ్ధం

**దస్తూరాబాద్, మే 29 (జనంసాక్షి):** మండలంలోని భూత్కూరు గ్రామపంచాయితీ పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ఆయిల్ ఫామ్ తోట దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి తోట అంతటా వ్యాపించాయి. ఎండ తీవ్రతతో పాటు గాలి వేగంగా వీయడంతో మంటలు అదుపు తప్పినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిప్రమాదంలో ఆయిల్ ఫామ్ మొక్కలతో పాటు సాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులు కూడా కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను గమనించిన గ్రామస్థులు, రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనతో రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు.

## ఆర్ట్స్ కళాశాలలో పాలీసెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

**హనుమకొండ ప్రతినిధి మే 29 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాలీసెట్ అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ప్రారంభించి విద్యార్థికి అడ్మిషన్ సర్టిఫికెట్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ జూన్ 1 వరకు కొనసాగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే విద్యార్థులు అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకొని రావాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని విద్యార్థులకు ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సింగరేణి కార్మికుడు

- కీబోర్డు అద్భుతంగా వాయించినందుకు గాను ఘనత




**బెల్లంపల్లి, మే 29 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు, శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధులు నిర్వర్తిస్తున్న మంతెన భాస్కర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. గత ఫిబ్రవరి 2న హైదరాబాద్లోని జొరాస్ట్రియన్ క్లబ్ లో గిన్నిస్ బుక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సమన్వయంతో జరిగిన సంగీత కార్యక్రమంలో 22 దేశాల నుంచి సుమారు 2000 మంది కీబోర్డు సంగీత వాయిద్యకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరచిన కొంతమందిని గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు. అందులో బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు మంతెన భాస్కర్ గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం ఎంపికవ్వడం విశేషం. ఎంపిక అయిన మంతెన భాస్కర్ కు శుక్రవారం హైదరాబాదులోని గచ్చిబౌలిలో గల విక్టరీ ఆడిటోరియంలో జరిగిన "గిన్నిస్ అచీవర్స్ మీట్" కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్ అందుకున్నారు.

### కష్టాల్లోంచి కార్మికుడిగా, ఇష్టపడి కీబోర్డు ప్లేయర్..

బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన మంతెన రాజయ్య పోసమ్మ దంపతుల మూడవ సంతానమే మంతెన భాస్కర్. భాస్కర్ కు అన్న రమేష్, అక్క రమా, తమ్ముడు సంజీవ్ ఉన్నారు. భాస్కర్ కు పదేళ్ల వయసు ఉన్నప్పుడే 1996లో తండ్రి రాజయ్య శాంతిఖనిలో గని ప్రమాదంలో మృతి చెందారు. అప్పట్నుంచి తల్లి పోసమ్మే నలుగురు పిల్లలను ధైర్యంతో పెంచి పెద్ద చేస్తూ వచ్చింది. భాస్కర్ అన్న రమేష్ కు వారసత్వంగా తండ్రి ఉద్యోగం వచ్చింది. రమేష్ తన చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లకు తండ్రి స్థానంలో ఉండి తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసి ఎన్నో కష్టాలు పడి చదివించాడు. ఎన్నో అవమానాలు ఆర్థిక ఇబ్బందులను దాటుకుంటూ రమేష్ తన తల్లి సహకారంతో చెల్లెల్ని తమ్ముళ్లను ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. ఈ కష్టాల్ని, త్యాగాల్ని గమనిస్తూ పెరుగుతూ వచ్చిన భాస్కర్ బాగా చదువుకొని సింగరేణి సంస్థ 2018 లో ఇచ్చిన నోటిఫికేషన్ లో ఎలక్ట్రీషియన్ గా ఉద్యోగం సాధించాడు. 2018లో శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధుల్లో చేరాడు. 2023లో సుప్రియను వివాహమాడారు. వీరికి కుమారుడు లియోనార్డో ఉన్నాడు.

### మంతెన భాస్కర్ కు ప్రశంసల వెల్లువ.

గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు కుటుంబసభ్యులు ఎంతగానో అభినంధించినారు ఆనందంలో కుటుంబసభ్యులు సంబారాలు చేసుకున్నారు. భాస్కర్ పనిచేస్తున్న సింగరేణి సమస్త ఉన్నత అదికారులు, మరియు శాంతిఖని గని అధికారులు, తోటి కార్మికులు, యూనియన్ నాయకులు,బంధువులు, మిత్రులు ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

## బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

- పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ప్రతినిధి మే 29 (జనం సాక్షి) :** బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పొగాకు నియంత్రణ చట్టం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాలు, పాఠశాలలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని పేర్కొంటూ, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిం చాలని సూచించారు. ఈ నెల 31న నిర్వహించే ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య జిల్లాలో చేపడుతున్న పొగాకు నియంత్రణ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యహరించండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, మే 29 (జనం సాక్షి) :** చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, సాధరణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించే రౌడీ షీటర్ల పట్ల అణిచివేత ధోరణీతో వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. నెల నేర సమీక్షా సమావేశంలో భాగం కిట్స్ కళాశాలలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమషనర్ అధ్వర్యంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా శాంతి భద్రతలకు సంబంధించి అంశాలను ప్రస్తావిస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే రౌడీ షీటర్లకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో వంద శాతం రౌడీ షీటర్లు అందరు హజర్ కావాలని. ప్రతి నెల ఒకమారు స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారిని తనఖీ చేయాల్సి వుంటుంది. ఇదే సందర్భంగా వారి స్థితిగతులపై కుడా ఆరా తీయాలని, తనిఖీ సమయాల్లో లేని రౌడీ షీటర్ల కదలికలపై వివరాలను సేకరించాలని. నేరాల నియంత్రణలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి సమయాల్లో బెల్ట్ షాపులను మయించాలని, అలా చేయకుంటే వారిపై కేసులు నమోదు చేయడం లేదా బైండోర్ చేయాలని, ముఖ్యంగా నిర్ణీత సమయాల్లో షాపులను మయించాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ అధికారిపై వుందని. రాత్రి సమయాల్లో అధికంగా రద్దీ వుండే ప్రాంతాలను గుర్తించి అక్కడ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇకపై రాత్రి సమయాల్లో ఎవరైన రోడ్లపై జన్మదిన వేడుకలు జరుపుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చోరీల కట్టడికై ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇండ్లతో పాటు ఇతర వ్యాపార సంస్థల్లో పనులు చేసే వారి వివరాలతో పాటు హస్టల్స్ నిర్వహణకు సంబందించిన వివరాలు సైతం స్థానిక పోలీసులు సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపిలు అకింత్ కుమార్, దార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్ రావు, బాల స్వామి,సురేష్ కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి కరస్పాండెంట్, మే 29 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ



అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,కలెక్టరేట్ ఏవో అంజి రెడ్డి,మునిసిపల్ కమిషనర్ లు, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణలో పాల్గొన్న వేలాది భక్తులు



**యాదగిరిగుట్ట, మే 29 (జనంసాక్షి) :** నారసింహుని జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు ఆలయ అర్చకులు. 108 కలశాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి కలశాలలోని జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలలోని జలాలతో పాటు పంచామృతం తో మెళితమైన సుగంధ ద్రవ్యలతో పంచసూక్త పఠనాలు, వేదమంత్రలు, మంగళ వాయిద్యాల నడుమ నరసింహునికి అష్టోత్తర శత ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. అలాగే స్వాతి నక్షత్రం సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ చేశారు ఆలయ ఈఓ భవాని శంకర్, ఎస్పీఎఫ్ అధికారులు, భక్తులు,స్థానికులు,ఆలయ అధికారులు. ఆలయ కొండ చుట్టూ అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటాలు, భక్తి గీతాలాపనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, లక్ష్మీ నరసింహుడి నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణ చేశారు భక్తులు. గిరి ప్రదక్షిణ చేసి లక్ష్మీ నర్సింహుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## వికలాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదగిరిగుట్ట మే 29 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న సేవలు, పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది పిల్లలు ఉన్నారని, వారు ఏఏ వయస్సు వారు పిల్లలు ఉన్నారని వివరాలు తెలుసుకున్నారు. అలాగే పిల్లల సంరక్షణ, శిక్షణ కోసం ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నానీ అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న విద్య, పునరావాస సేవలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్రానికి నిర్మిస్తున్న నూతన భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణం ప్రస్తుతం ఏ దశలో ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా కేంద్రానికి అవసరమైన సదుపాయాలు ఏమున్నాయో వివరాలు అడిగి తెలుసుకొని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో కేంద్రం నుండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రోత్సహించారు. దివ్యాంగ పిల్లలకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రేమ జంట వ్యవహారంలో ఉద్రిక్తత

- కులాంతర వివాహం చేసుకున్న నవవధువు కిడ్నాప్
- యాచారం పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలిపిన వరుడి కుటుంబ సభ్యులు
- యాచారం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు
- కిడ్నాపర్ల కోసం గాలింపు ముమ్మరం

**యాచారం, మే 29 (జనం సాక్షి) :** కుల వివక్ష కారణంగా ఒక ప్రేమ జంట జీవితంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా, మదనపురం మండలం, చింతపల్లి గ్రామానికి చెందిన పోలే వంశీ (ఎస్సీ మాదిగ), ఆగపల్లి గ్రామానికి చెందిన గోసుల తేజస్వి (గొల్ల) గత కొంతకాలంగా ప్రేమించుకుని, ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన వివాహం చేసుకున్నారు. పెళ్లి అనంతరం రక్షణ కోరుతూ వారు హైదరాబాద్‌లోని మీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆ సమయంలో పోలీసులు అమ్మాయి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ, వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు.ఈ క్రమంలో రక్షణ కోసం ఈ జంట యాచారం మండలంలోని మొండి గౌరెల్లి గ్రామంలో ఉన్న వంశీ అమ్మమ్మ గారి ఇంట్లో నివసిస్తోంది. అయితే, మే 27 (బుధవారం) సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అమ్మాయి కుటుంబ సభ్యులు కారులో వచ్చి, వంశీ కుటుంబీకులను తీవ్రంగా బెదిరించి, తేజస్విని బలవంతంగా కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వంశీ బంధువులపై కూడా వారు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు.ఈ ఘోర కలికపై బాధితుడు వంశీ యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్‌నకు సహకరించిన బాల మల్లేష్, ఉపసర్పంచ్ బడే కుమార్, తాండ్ర యాదయ్యలతో పాటు అమ్మాయి బంధువులు గోసుల కృష్ణమూర్తి, గోసుల వెంకటేష్, గోసుల శ్రీశైలం, వంగూరి రవి, వంగూరి రమేష్‌లపై పోలీసులు కేసు నమోదు



చేశారు.ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా తేజస్వి ఆచూకీ లభించకపోవడంతో, వంశీ మరియు అతని బంధువులు యాచారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.తన భార్య ను తనకు సురక్షితంగా అప్పగించాలని వంశీ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయగా అక్కడ ఉన్నవారు అడ్డుకున్నారు అనంతరం యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి జోక్యం చేసుకుని, కిడ్నాపర్లను త్వరలోనే పట్టుకుని అమ్మాయిని సురక్షితంగా అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు నిరసనను విరమించారు.

## ప్రజలకు రక్షణగా నిలవడమే ప్రథమ ప్రాధాన్యత

- జిల్లా ఎస్పీ అక్షయ్ యాదవ్

**వలిగొండ, మే 29 (జనం సాక్షి) :** వలిగొండ పోలీస్ స్టేషన్లో ను జిల్లా ఎస్పీ అక్షయ్ యాదవ్ ఐపిఎస్ ఆకస్మిక తనిఖీ చేశారు. పెట్రోలింగ్, ప్రజా ఫిర్యాదులపై సిబ్బందికి కీలక ఆదేశాలు. శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణగా నిలబడడమే మా ప్రథమ ప్రాధాన్యత. స్టేషన్ పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, అత్యవసర సమయంలో స్పందించే



విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. స్టేషన్లో రిసెప్షన్ కౌంటర్, క్రైమ్ విభాగం, జనరల్ డైరీ నిర్వహణ నిశితంగా ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్లకు చెందిన పెట్రోల్ కార్లు, బ్లూ క్లోత్స్ వాహనాల స్థితిగతులను, వాటి సంసిద్ధతను ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. వాహనాలలోని సైనర్లను, కమ్యూనికేషన్ సెట్లను, జిపిఎస్ వ్యవస్థల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. దర్యాప్తును వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోనే షార్ట్ ఫీట్లు దాఖలు చేయాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు .నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలలో బ్లూ కోట్లు ,పెట్రోల్ వాహనాలు నిరంతరం గస్తి కాయాలి.ప్రజలలో పోలీసులపై నమ్మకం పెంచేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి. స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే సహాయం అందించాలి. అర్హత గల ఫిర్యాదులపై ఎఫ్ ఐ ఆర్ చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదు. శాంతి భద్రత పర్యవేక్షణలో ,విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ రామన్నపేట వెంకటేశ్వర్లు, ఎస్సై యుగేందర గౌడ్, కానిస్టేబుల్స్ ఉన్నారు.

## మహిళా కమిషన్ సభ్యులకు ఘన సన్మానం

- ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**మోత్కూరు, మే 29 (జనం సాక్షి) :** మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని మధుర మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అధ్యక్షత వహించగా, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా మహిళా నాయకులు, కాంగ్రెస్



పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళా కమిషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా కమిషన్ మరింత చురుకుగా పని చేయాలని ఆకాంక్షించారు. మహిళలపై జరిగే అన్యాయాలు, వేధింపుల నివారణలో కమిషన్ సభ్యులు సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణలో మహిళా కమిషన్ బాధ్యత చాలా కీలకమని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులుగా నియమితులైన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలు ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే మహిళలపై జరిగే అన్యాయాల నివారణ, చట్టపరమైన అవగాహన కల్పించడం, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం వంటి అంశాల్లో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



**యాదాద్రి కరస్పాండెంట్, మే 29 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు నియోజక వర్గాలలోని బూత్‌ల వారీగా బిఎల్‌వో లను నియమించుకుని ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బూత్ స్థాయి ఏజెంట్లు రాజకీయ పార్టీలకు అధికారిక ప్రతినిధులుగా వ్యవహరిస్తారని,అలాగే ఎస్. ఐ ఆర్ కార్యక్రమాల పారదర్శకత ను పర్యవేక్షిస్తారన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి ఓటర్లను లెక్కించే సమయంలో ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ బూత్ స్థాయి అధికారులకు సహాయం చేస్తారని అన్నారు. మరణించిన ఓటర్లను, వేరే చోటికి మారిన ఓటర్లను, నకిలీ నమోదులను, హాజరు కానీ అర్హులైన గుర్తించడంలో సహాయ పడతారని తెలిపారు. ఎస్. ఐ ఆర్ విధానాలను అర్థం చేసుకోవడంలో సహాయ పడతారని, వారు నమోదు, తొలగింపు లేదా మార్పుల కోసం ఫారాలను సరిగ్గా ఎలా పూరించాలో పౌరులకు మార్గ నిర్దేశం చేయడం జరుగుతుంది. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు ను కూడా విస్మరించకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారి, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని, అలాగే సవరణ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలకు తప్పక హాజరు కావాల్సి ఉంటుందని, ఓటర్ల జాబితాలలో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని మెరుగు పరచడానికి ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమాలలో బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా పాల్గొనాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, బూత్ స్థాయి ఏజెంట్లను నియమించనీ రాజకీయ పార్టీలు ప్రతినిధులు వెంటనే నియమించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి,వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, మే 29 (జనం సాక్షి) :** శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నా రన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ -2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**మాడుగులపల్లి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని మీసేవ ఆధార్ కేంద్రాన్ని నల్లగొండ జిల్లా ఈడిఎం (ఎలక్ట్రానిక్ డిస్ట్రిక్ట్ మేనేజర్) చల్లా దుర్గారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సేవలు, వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులు స్టేషనరీని ఆయన స్వయంగా నిశితంగా పరిశీలించారు. ప్రజలతో ముఖాముఖి తనిఖీలో భాగంగా మీసేవ సర్వీసుల కోసం వచ్చిన మండల ప్రజలతో చల్లా దుర్గారావు నేరుగా మాట్లాడారు కేంద్రంలో సేవలు సకాలంలో అందుతున్నాయా? నిర్వాహకుల తీరు ఎలా ఉంది అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఈడిఎం చల్లా దుర్గారావు కీలక ఆదేశాలు ఈ సందర్భంగా చల్లా దుర్గారావు మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో ప్రజలు అప్లికేషన్ చేసుకున్న తర్వాత ఆ దరఖాస్తు పత్రాలను (హార్డ్ కాపీలను) మళ్లీ ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగానే ఆన్‌లైన్ లోనే నేరుగా అప్లికేషన్ అప్‌లోడ్ అయిపోతుందని, కాబట్టి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని వివరించారు కేంద్రానికి వచ్చే మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా సేవలు అందించాలని, ప్రభుత్వ



నిబంధనల ప్రకారం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అధిక రుసుములు వసూలు చేయకూడదని మీసేవ యాజమాన్యానికి చల్లా దుర్గారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు ఈ తనిఖీ కార్యక్రమంలో డిస్టిక్ మేనేజర్ శివ,మీసేవ కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.




# శాంతిపై అనిశ్చితి..

## సెన్సెక్స్ 1092 పాయింట్లు డౌన్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో అనిశ్చితి, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,550 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,988.51 (క్రితం ముగింపు 75,867.80) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే 76,220.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో 74,589.11 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరికి 1092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్లు మిగిలిన షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4530 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**

శాంతి ఒప్పందం విషయం లో ఇంకా స్పష్టత రాకపోవడం స్టాక్ మార్కెట్ నష్టానికి ప్రధాన కారణం. అమల్లో ఉన్న కాల్పుల విరమణ పొడి గింపు, అణు కార్యక్రమంపై చర్చలను ప్రారంభిం చేందుకు అమెరికా, ఇరాన్ ప్రతినిధులు ఓ తాత్కాలిక ఒప్పందానికి చేరువైనా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనికి ఆమోదం తెలపాల్సి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓ వైపుచర్చలు జరుపుతూనే మరోవైపు ఇరు దేశాలు దాడులు, ప్రతీకార దాడులకు దిగుతుండడం మదుపర్లను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో వారాంతంలో స్టాక్ మార్కెట్‌పై ఆ ప్రభావం పడింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి విదేశీ మదుపర్ల తరలిపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీ స్తోంది. బుధవారం రూ.1040 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. 2025 ఏడాది పొడవునా విక్రయించిన దానికంటే ఎక్కువగా ఈ ఏడాది ఇప్పటికే పెద్ద మొత్తంలో ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది. ఈ సారి వర్షాకాలం సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావొచ్చన్న వాతావరణ శాఖ అంచ నాలు కూడా స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణ మయ్యాయి.


# రూ.500 నోటుకు నకిలీల బెడద

## 20% పెరిగిన నకిలీలు

ముంబయి: రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తర్వాత రూ.500 నోటుకు ఆదరణ పెరిగింది. 2025-26లో బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న వీటి సంఖ్య 11.2 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో నకిలీ నోట్ల బెడదా పెద్ద ఎత్తున రూ.500 నోటు ఎదుర్కొంటున్నట్లు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో తెలిపింది. 2026 మార్చి నాటికి 7,05,482 లక్షల రూ.500 నోట్లు చలామణిలో ఉండగా.. అంతకుముందు ఏడాది ఇదే సమయానికి 6,34,458 లక్షల నోట్లు సర్క్యులేషన్‌లో ఉన్నాయి. విలువ పరంగా చూస్తే రూ.31.72 లక్షల కోట్ల నుంచి రూ.35.27 లక్షల కోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. మార్కెట్‌లో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో ఎక్కువ వాటా కూడా 500 రూపాయల నోటుదే. సంఖ్యా పరంగా 41.2 శాతం వాటా కలిగి ఉండగా.. విలువ పరంగా 86 శాతం వాటా వాటిదే కావడం గమనార్హం. సంఖ్యాపరంగా రూ.10 నోటు 16.1 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువ 11.9 శాతం, సంఖ్య 10.5 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దీనిబట్టి ఆర్థిక వ్యవస్థలో నగదు డిమాండ్ ఇంకా కొనసాగుతోందనడానికి ఇది సూచికగా నిలుస్తోంది.

**నకిలీ మకిలీ**

బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్లు కూడా పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్‌బీఐ గుర్తించింది. గతేడాదితో పోలిస్తే ఈ నకిలీల బెడద 20 శాతం పెరిగినట్లు తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 రూ.500 నోట్లను గుర్తించగా.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 1,41,907 నోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 30,591 నకిలీ రూ.200 నోట్లను గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. మొత్తంగా బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ నోట్ల బెడద 5.7 శాతం మేర పెరిగినట్లు పేర్కొంది. 2023 మే నెలలో రూ.2వేల నోటును ఉపసంహరించుకున్న తర్వాత 2026 మార్చి 31 నాటికి 98.45 శాతం నోట్లు వెనక్కి వచ్చినట్లు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది.



# టాటా టియాగో ఈవీ జీ రూ.6.99 లక్షలు

**దిల్లీ:** టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తదుపరి తరం టియాగో, టియాగో సీఎన్‌జీ, ఈవీ (విద్యుత్తు) మోడళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేసింది. ప్రారంభ స్థాయి టియాగో పెట్రోల్ హ్యాచ్‌బ్యాక్ ధరను రూ.4.69 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించింది. సీఎన్‌జీ వెర్షన్ ధరను రూ.5.79 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. ఈవీ ధరను రూ.6.99 లక్షలుగా పేర్కొంది. టియాగో ఈవీని బ్యాటరీ అద్దె ప్రాతిపదికన (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) తీసుకుంటే రూ.4.69 లక్షలు + కిలోమీటరుకు రూ.2.60 చొప్పున చెల్లించాలి. కొత్త టియాగోలో డిజైన్, ఇంటీరియర్, సదుపాయాల పరంగా చాలా మార్పులు చేపట్టారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి మోడళ్లతో ఈ కారు పోటీ పడనుంది. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్, డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జర్, 360 డిగ్రీల కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటర్, రియర్ ఏసీ వెంట్స్, క్రూయిజ్ కంట్రోల్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, ఆటో హెడ్‌ల్యాంప్స్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, హిల్ హోల్డ్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

**ఒకసారి ఛార్జింగ్‌తో 205-215 కి.మీ. ప్రయాణం**

టియాగో ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లలో లభిస్తుంది. 19.2 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యం కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 205 కిలోమీటర్లు, 24 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 285 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. 3.3 కిలోవాట్ పోర్టబుల్ ఛార్జర్, 7.2 కిలోవాట్ హోమ్‌ఛార్జర్, 30 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ ఆప్షన్లతో లభిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాహనాల గిరాకీపై ఇంధన ధరల పెంపు ప్రభావం పడొచ్చని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర అభిప్రాయ పడ్డారు. వాహన అమ్మకాలపై పడే ప్రతికూల ప్రభావం అంచనా వేయాలంటే.. మొత్తం వినియోగ తీరుపై, వినియోగదారుల సెంటిమెంటుపై ధరల పెరుగుదల ప్రభావాన్ని పర్యవేక్షించాలని వివరించారు. 2026-27లో ప్రయాణికుల వాహనాల (ముఖ్యంగా కార్ల) అమ్మకాల్లో 10% వృద్ధి అంచనాను మార్చడం కూడా తొందరపాటు చర్య అవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యుత్, హైబ్రిడ్ వాహనాల్లో ఉపయోగించే అధునాతన లో-వోల్టేజ్, హై-వోల్టేజ్ పీటీసీ హీటర్లను మనదేశంలో తయారు చేసి, సరఫరా చేయడానికి కొరియాకు చెందిన జహ్వా ఎలక్ట్రానిక్స్‌తో సంయుక్త సంస్థ (జేవీ)ను ప్రారంభించినట్లు టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ గురువారం వెల్లడించింది.

**డాలర్‌పైనే ఆధార పడొద్దు**

**పెట్టుబడులపై కుబేరుల పునరాలోచన**

'అంతర్జాతీయ అనిశ్చితులు కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచవ్యాప్తంగా కుబేరులు తమ పెట్టుబడుల తీరుపై ఆలోచనలో పడుతున్నారు. అమెరికా డాలరుపై ఆధారపడే విషయంలో ఆచితూచి వ్యహరిస్తున్నార'ని యూబీఎస్ రూపొందించిన గ్లోబల్ ఫ్యామిలీ ఆఫీస్ రిపోర్ట్ 2026 చెబుతోంది.

# ఎల్ఐసీ షేర్లు 50 శాతం పడ్డాయా?

### కారణం ఇదే..

ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ షేర్లు శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో 50 శాతం మేర క్షీణించినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఎల్ఐసీ బోనస్ ఇష్యూ సంగతి తెలీని వారు ఈ మార్పు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. శుక్రవారం నుంచి బోనస్ షేర్ల జారీ షేరు విలువలో ప్రతిఫలించడమే ఇందుకు కారణం. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎల్ఐసీ షేరు విలువ రూ.830గా ఉంది. బోనస్ షేరు వల్ల విలువ సగమైంది. ఈ క్రమంలోనే శుక్రవారం మార్కెట్ ప్రారంభంలో రూ.417.60 వద్ద ప్రారంభమైంది. తర్వాత ఒక శాతం నష్టంతో రూ.411 వద్ద మగిసింది. అంటే నష్టపోయింది ఒక శాతం లోపే. కానీ, 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయడం వల్ల స్టాక్ ధరలో పెద్ద మొత్తంలో నష్టపోయినట్లు కనిపించింది. మే 29 నాటికి ఎల్ఐసీ షేర్లు ఉన్నవారికి 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయాలని ఎల్ఐసీ నిర్ణయం తీసుకుంది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖ విలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు గతంలో ఎల్ఐసీ సమాచారం ఇచ్చింది. దీనివల్ల కంపెనీ షేర్లు సంఖ్య పెరగడమే కాకుండా.. రిటైల్ మదుపర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,95,000

# అమెరికా డ్రోన్‌ను బూడిద చేసిన ఇరాన్ బ్రహ్మాస్త్రం

## ఏంటీ కొత్త ఆయుధం..?



**టెహ్రాన్:**ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా లక్ష్యం ఏంటనేది కాసేపు పక్కనబెడితే.. ఈ ఘర్షణల్లో ఆ దేశానికి సైనికపరంగా జరుగుతున్న నష్టం మాత్రం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా అమెరికాకు చెందిన అత్యంత ఖరీదైన ఆయుధాలను టెహ్రాన్ చాలా చౌకగా మసిచేస్తుండటం అగ్రరాజ్యానికి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఇటీవల హర్మూజ్ సమీపంలో అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఇరాన్ ఇలాగే కూల్చేసింది. ఇందుకోసం తాము స్థానికంగా అభివృద్ధి చేసిన కొత్త గగనతల రక్షణ వ్యవస్థను ఉపయోగించినట్లు టెహ్రాన్ పేర్కొంది. అదే 'అరాశ్ ఇ కమాన్‌గీర్'..!

**యుద్ధంలో తొలిసారి..**

హర్మూజ్ సమీపంలోని శత్రు డ్రోన్‌ను కూల్చేందుకు ఇరాన్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'అరాశ్ ఇ కమాన్‌గీర్' సిస్టమ్‌ను ఉపయోగించినట్లు ఐఆర్‌జీసీ అనుబంధ మీడియా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇది అత్యంత సమర్థమైన వ్యవస్థ అని పేర్కొంది. అయితే, దాని సాంకేతిక వివరాలను మాత్రం బహిర్గతం చేయలేదు. అటు ఇరాన్ ప్రభుత్వం నుంచి గానీ, ఇటు ఐఆర్‌జీసీ నుంచి గానీ దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. ఇది నిజమైతే గనుక.. యుద్ధ రంగంలో ఈ అరాశ్ గగనతల రక్షణ వ్యవస్థను ఉపయోగించడం ఇదే తొలిసారి అవుతుంది. సాధారణంగా అమెరికాతో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇరాన్ చౌకగా లభించే, వేగంగా మోహరించే స్వదేశీ రక్షణ వ్యవస్థలనే వినియోగిస్తోంది. గతంలో అమెరికాకు చెందిన అత్యాధునిక క్షిపణులను షాహెద్ వంటి డ్రోన్లతో అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల సుదీర్ఘకాలం యుద్ధం కొనసాగితే ఆర్థిక భారం పడకుండా ఉంటుందనేది ఇరాన్ భావన. ఇప్పుడు కూడా ఇలాగే 'అరాశ్' వ్యవస్థను ఉపయోగించి ఉండొచ్చని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ఆ వీరుడి పేరు మీదుగా..**

పర్షియన్ పురాణాల ప్రకారం 'అరాశ్: ది ఆర్చర్' అనే ఓ యోధుడు ఉండేవాడట. పశ్చిమ దేశాల ప్రభావం ఇరాన్‌పై పడకుండా ఉండేందుకు అతడు పోరాడినట్లు చెబుతారు. ఈ క్రమంలోనే మధ్య ఆసియా, ఇరాన్ మధ్య అతడు బాణంతో సరిహద్దు గీసినట్లు పేర్కొంటారు. ప్రాణాలు అర్పించి మరీ అరాశ్ ప్రయోగించిన ఆ బాణం.. కొన్ని రోజుల పాటు వందల మైళ్లు ప్రయాణించి చివరకు మధ్య ఆసియాలోని ఓ నది ఆవల ఉన్న చెట్టును తాకినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. అక్కడి వరకు ఇరాన్ సరిహద్దు అని అరాశ్ చెప్పినట్లయ్యింది. ఆ వీరుడు పేరు మీదుగానే ఇరాన్ తమ సరికొత్త గగనతల రక్షణ వ్యవస్థకు 'అరాశ్ ఇ కమాన్‌గీర్' అని పేరు పెట్టింది.

**ఎలా పనిచేస్తుంది..?**

తక్కువ బడ్జెట్‌లో ఇరాన్ అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో 'అరాశ్' కీలక ముందడుగు అని రక్షణరంగ నిపుణులు పేర్కొంటున్నారు. దీని సామర్థ్యాలేంటో పూర్తిగా బయటకు రానప్పటికీ.. కొంతమంది విశ్లేషకులు దీని పనితీరును అంచనా వేస్తూ పలు నివేదికలు రూపొందించారు. సాధారణ గగనతల రక్షణ వ్యవస్థల మాదిరిగా.. ఇది రాడార్లు, లాంచ్ బ్యాటరీలపై ఆధారపడి పనిచేయదు. రాడార్ సైట్లు ఇచ్చే నిర్దిష్ట మార్గదర్శకాలపై ఆధారపడదు. ఎలక్ట్రో ఆప్టికల్ లేదా హీట్-సీకింగ్ గైడెన్స్ వ్యవస్థల వినియోగించుకుంటుంది. ఇందులోని ఇంటర్‌సెప్టర్ కొన్ని గంటల పాటు గాల్లో తిరుగుతూ శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తిస్తుంది. అవి కన్పించగానే పేల్చేస్తుంది. వీటిని తయారు చేయడం, మోహరించి ఉపయోగించడం చాలా తేలిక అని నిపుణులు చెబుతున్నారు. తాజాగా ఈ వ్యవస్థ కూల్చిన ఎంక్యూ-9 డ్రోన్ విలువ దాదాపు 16 మిలియన్ డాలర్ల నుంచి 30 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. దీన్ని బట్టి చూస్తే ఇరాన్ చౌకగా కొడుతున్న దెబ్బకు అమెరికా ఏమేర నష్టపోతోందో అర్థం చేసుకోవచ్చు.

# తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమిర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

# కాటేసిన కల్తీ మద్యం

పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్నవారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు. వీరిద్దరూ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# 'క్యూర్' పరిధిలో ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ఫ్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# సంక్షేమ పథకాలకు డిజిటల్ కరెన్సీ

## వార్షిక నివేదికలో ఆర్‌బీఐ

ముంబయి: సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్‌ను మరింత విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోచిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైల్ రంగానికీ విస్తరించాలని భావిస్తోంది. ఫైనాన్షియల్ అసెట్ టోకనైజేషన్‌కు ఉన్న అవకాశాలనూ పరిశీలించాలని ఆర్‌బీఐ యోచిస్తోంది. తద్వారా సీబీడీసీ పైలట్ ప్రాజెక్ట్‌లో మరింత మందిని భాగస్వాములను చేయాలనుకుంటోంది. ఈ మేరకు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో ఈ అంశాన్ని పొందుపరిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్‌లలో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ లబ్ధిదారులకూ ఆహార సబ్సిడీని సీబీడీసీ ద్వారా అందించారు. లబ్ధిదారులు ఆ నిధులను రేషన్ షాపులు, ఎంపిక చేసిన వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా చూశారు. దీన్ని మరింత విస్తరించాలని భావిస్తోంది. పశ్చిమాసియా రూపంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన ఇంధన ధరలు, సప్లయ్ చైన్ అవరోధాలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధికి ఢోకా లేదని ఆర్‌బీఐ పేర్కొంది. పటిష్ఠమైన స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే దీనికి కారణమని తన వార్షిక నివేదికలో తెలిపింది. కార్పొరేట్, బ్యాంకింగ్ రంగాల బలోపేతమైన బ్యాలెన్స్ షీట్లు, ప్రభుత్వ మూలధన వ్యయం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సానుకూలంగా ఉండనుందని తెలిపింది. వివిధ వాణిజ్య భాగస్వాములతో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా వృద్ధికి దన్నుగా నిలవనున్నాయని అభిప్రాయపడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.6 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ గుర్తు చేసింది. 2026-27లో వ్యవసాయ రంగం నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుందని అంచనా వేసింది. ఎల్‌నినో కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం ఉన్నా.. రుతు పవనాల ప్రయాణంలో హిందూ మహాసముద్రంలో ఏర్పడే డైపోల్ ద్వారా ప్రతికూల ప్రభావాన్ని అధిగమించొచ్చని పేర్కొంది.



# కరవును జయించే వరి!..

## కొత్త రకం అభివృద్ధిలో చైనా కీలక విజయం



**బీజింగ్:**ప్రపంచ జనాభాలో దాదాపు సగం మందికి వరి ప్రధాన ఆహారం. దీన్ని పండించడానికి భారీగా నీరు అవసరం. వాతావరణ మార్పుల వల్ల వర్షపాతంలో లోటుపాట్లు వరి దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కరవును తట్టుకునే, అతి తక్కువగా నీటిని వినియోగించే వరి రకాలను కనుగొనేందుకు శాస్త్రవేత్తలు ఏళ్లుగా శ్రమిస్తున్నారు. ఈ విషయంలో గణనీయ పురోగతి సాధించినట్లు చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. బ్రిటన్ సైతం ఈ దిశగా కీలక అడుగులు వేస్తోంది. వేడెక్కుతున్న నేటి ప్రపంచంలో.. వ్యవసాయానికి ఇదో శుభవార్త. కరవును తట్టుకోగలిగి, తక్కువ నీటితో వరి పండడానికి దోహదపడే కీలకమైన హెచ్ఎంజీబీ1 జన్యువును చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. మొత్తం 16 వరి రకాల(సగం మెట్ట, సగం నీటిపారుదల)పై అధ్యయనం చేసి, వాటి వేర్లు, జన్యు కార్యకలాపాలను విశ్లేషించారు. వేర్ల అభివృద్ధికి దోహదపడే 376 జన్యువులను గుర్తించారు. ఇందులో హెచ్ఎంజీబీ1 వీరి పరిశోధనలో ప్రధాన పాత్ర పోషించింది. వేర్ల పెరుగుదలను ఈ జన్యువు నెమ్మదింపజేస్తుంది. నీటి కోసం భూమి లోతుల్లోకి వెళ్లే వేర్లకు అడ్డుకట్ట వేస్తుంది. పొడి ప్రాంతాల్లో మనుగడ సాగించేలా మందపాటి వేర్లు పెరగడానికి ఉపకరిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వేర్లు నిటారుగా భూమిలోకి చొచ్చుకుపోవడానికి హెచ్ఎంజీబీ1 జన్యువు బ్రేకులా అడ్డుకట్ట వేస్తుంది కాబట్టి ఉన్నచోటే ఆ వేర్లు మందంగా, బలంగా తయారవుతాయి. ఇది మొక్కకు కరవును తట్టుకునే శక్తిని బాగా పెంచుతుందని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' ప్రచురించింది. యాదృచ్ఛికంగా మొక్కలను సంకరం చేయడానికి బదులుగా, నిర్దిష్ట జన్యువులను లక్ష్యంగా చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ పరిశోధన దోహదపడుతుంది. హువాజోంగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీజీఐ-రీసెర్చ్, యునాన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలో పాలుపంచుకున్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే జన్యు వైవిధ్య వరి మొక్కల అభివృద్ధిపై బ్రిటన్‌లోని నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం సట్టన్ బోనింగ్టన్ క్యాంపస్ గ్రోత్ రూమ్స్‌లో పెద్దఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. వేడి ఒత్తిడికి, కరవుకు వివిధ మొక్కలు ఎలా స్పందిస్తాయన్న దానిని ఇక్కడ అధ్యయనం చేస్తున్నారు. వాతావరణ మార్పులకు వేర్లు దెబ్బతినకుండా ఎలా స్పందిస్తాయో తెలుసుకోవడానికి వర్సిటీలోని హాన్స్‌ఫీల్డ్ ఫెసిలిటీలో వరి మొక్కలను మైక్రో-సీటీ స్కానర్‌లో విశ్లేషిస్తున్నారు. లోతుగా, నిటారుగా పెరిగే వేర్లు భూమి లోతుల్లోకి వెళ్లి ఎక్కువ నీటిని సంగ్రహిస్తాయి. దాన్ని నియంత్రించే జన్యువును గుర్తించి, కొత్త రకాల అభివృద్ధిలో వినియోగించుకుంటామని హాన్స్‌ఫీల్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ క్రెయిగ్ స్టర్రాక్ చెప్పారు. ప్రపంచంలో దాదాపు 75% వరి ఉత్పత్తికి నీటిపారుదలే ఆధారం. చైనాలో వ్యవసాయానికి అవసరమైన నీటిలో 70 శాతాన్ని వరి పంటకే వినియోగిస్తున్నారు. వరిని అత్యధికంగా పండించే ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌లాండ్‌లలో నీటిపారుదల కోసం భారీగా డబ్బు వెచ్చిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాజా పరిశోధనలు వరి రైతుల్లో కొత్త ఆశలు రేపుతున్నాయి. ప్రపంచ ఆహార భద్రతకు సరికొత్త భరోసా ఇస్తున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
30 మే 2026

# పేదల గృహస్థలాలపై మైనింగ్ దాడి



- అక్రమ తవ్వకాలతో గ్రామమే సమాధి అవుతోంది
- నేషనల్ హైవే పనుల పేరుతో అనుమతులు లేకుండా జేసీబీలు
- 1998లో కేటాయించిన ప్లాట్లను పూడ్చేస్తున్నారు
- న్యాయం కోసం తహసీల్దార్‌కు వినతిపత్రం

**మొయినాబాద్, మే 29 (జనంసాక్షి):**
మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన గృహస్థలాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ గ్రామవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే పనుల పేరుతో అనుమతులు లేకుండా భారీ స్థాయిలో తవ్వకాలు చేపట్టి గ్రామాన్ని సమాధి చేస్తున్నారని వేడుకున్నారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సర్వే నంబర్ 51/1లో సుమారు 300 మంది పేదలకు 110 గజాల చొప్పున గృహస్థల పట్టాలు మంజూరు చేశారు. ఆ స్థలాలు పేద కుటుంబాల జీవనాధారంగా మారాయని గ్రామస్తులు తెలిపారు. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కూడా ఈ లే-అవుట్‌లో శిలాఫలకం ఏర్పాటు చేసి అధికారిక గుర్తింపు ఇచ్చారు. ప్రస్తుతం కూడా ప్లాట్ల సరిహద్దు రాళ్లు, అంతర్గత రోడ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని వారు చెప్పారు. ఇటీవల ఎలాంటి స్పష్టమైన అనుమతులు లేకుండా భారీగా మైనింగ్ సాగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. పగలు--రాత్రి తేడా లేకుండా జేసీబీలు, లారీలతో తవ్వకాలు జరుగుతున్నాయని, దీనివల్ల పేదల గృహస్థలాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. "మాకు డబ్బు లేదు సార్... ఆ ప్లాట్లే మా బతుకు ఆధారం. మేం హైవే పనులకు వ్యతిరేకం కాదు, కానీ అనుమతులు లేకుండా అడ్డగోలుగా మైనింగ్ చేస్తూ గ్రామాన్ని సమాధి చేయొద్దు" అంటూ గ్రామ నిరుపేదలు ఆర్తనాదం చేశారు. అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను రక్షించాలని, అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అభివృద్ధి పేరుతో పేదల కలలను నేలమట్టం చేయొద్దంటూ వేడుకున్నారు.

## ఆరోగ్య పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా,ప్రతినిధి(జనంసాక్షి):** ఆరోగ్య పోషణపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మహిళా వారోత్సవాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల శారీరక,మానసిక అభివృద్ధిని ప్రభావితం చేస్తుందన్నారు. లోప పోషణ వల్ల పిల్లల ఎదుగుదల దెబ్బతింటుందన్నారు. గర్భిణీలు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్యం, పోషణపై కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు,సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డుల అమలుకు ముందు స్పష్టమైన విధి విధానాలు విడుదల చేయాలి

- డేటా ఎంట్రీ గడువు జూన్ 30 వరకు పొడిగించాలి
- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సందేహాలకు సమాధానం
- డిపెండెంట్ల సంఖ్య ఆధారంగా ప్రీమియం నిర్ణయించాలి
- టీయూటీఎఫ్ నేతల డిమాండ్





**హయత్‌నగర్, మే 29 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం అమలు చేయనున్న హెల్త్ కార్డుల పథకంపై ప్రభుత్వం ఇప్పటికి పూర్తి స్థాయి విధి విధానాలు విడుదల చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్నలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.
ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కీలక అంశంలో స్పష్టత లేకుండా హడావిడిగా అమలు దిశగా వెళ్లడం సరికాదన్నారు. హెల్త్ కార్డుల కోసం డేటా నమోదు ప్రక్రియకు గడువు విధించినప్పటికీ, స్కీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పటికీ వెల్లడించలేదని తెలిపారు. అందువల్ల డేటా ఎంట్రీ గడువును కనీసం జూన్ 30 వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లలో అనేక సందేహాలు నెలకొన్నాయని వారు మాట్లాడుతూ, హెల్త్ స్కీమ్ ద్వారా ఏ ఏ రోగాలకు చికిత్స అందిస్తారు, ఔట్ పేషెంట్ సేవలు ఉంటాయా లేదా, అత్యవసర చికిత్సల విధానం ఏమిటి, క్యాన్సర్, గుండె, కిడ్నీ, న్యూరో వంటి ఖరీదైన వ్యాధులకు పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందిస్తారా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ పథకంలో భాగస్వామ్యం అయ్యే ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల జాబితాను జిల్లా వారీగా ప్రకటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో లేకపోతే ఈ పథకం ప్రయోజనం తగ్గిపోతుందన్నారు. ప్రతి నియోజకవర్గ స్థాయిలో నాణ్యమైన ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి తెలిపారు.
పూర్తి స్థాయి విధి విధానాలు వెల్లడించకముందే ఉద్యోగుల జీతం నుండి 1.5 శాతం కోత విధిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. జీతం ఆధారంగా కాకుండా కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రీమియం నిర్ణయించడం మరింత న్యాయసమ్మతమైన విధానమని అభిప్రాయపడ్డారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరి జీతాల నుంచీ కోత విధించకుండా ఒక కుటుంబానికి ఒకే ప్రీమియం విధానం అమలు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం డిపెండెంట్ల వివరాలు సవరించుకునే అవకాశం కల్పించాలని, కుటుంబ పరిస్థితుల మార్పులకు అనుగుణంగా సవరణలు చేసుకునే విధానం ఉండాలని సూచించారు. పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిబంధనలు తీసుకురావాలని, వృద్ధులకు వైద్య సేవలు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రులు అదనపు బిల్లులు వసూలు చేయకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 24 గంటల టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.
ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరిపి, అన్ని సందేహాలకు సమాధానాలు ఇచ్చి, పూర్తి స్థాయి విధి విధానాలు విడుదల చేసిన తర్వాత మాత్రమే హెల్త్ కార్డుల అమలు చేపట్టాలని టీయూటీఎఫ్ నేతలు స్పష్టం చేశారు.

## దుర్గం చెరువులో దూకి మహిళా ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మే 29 (జనంసాక్షి) :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ పరిధి దుర్గం చెరువులో దూకి శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ డి. కృష్ణమోహన్ వెల్లడించిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో 25 నుండి 30 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని ఓ మహిళ అకస్మాత్తుగా దుర్గం చెరువులోకి దూకిన సమాచారం అందడంతో వారు హైడ్రా అధికారులతో కలిసి వెళ్లి చెరువులో గాలించగా ఓ మహిళ శవం లభించింది. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని మనిషి చామన చాయ రంగు కలిగి ఉండి, 25 నుండి 30 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు చుడీదార్ క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉందని మాదాపూర్ ఎస్హెచ్ఓ తెలియజేశారు. ఎవరికైనా సమాచారం అందినా, ఎవరింట్లోనైనా మహిళ తప్పిపోయినా ఈ ఆధారాలను ఆసరాగా చేసుకుని మాదాపూర్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని, ఏదైనా ఆచూకీ లభిస్తే 8712663109 నెంబర్ కు గాని, మాదాపూర్ ఇన్స్పెక్టర్ డి కృష్ణమోహన్ ఫోన్ నెంబర్ 8712663100 నెంబర్ కు సమాచారం అందించాల్సిందిగా మాదాపూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఇప్పటి దాకా 80 శాతం సేకరణ పూర్తి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 29 (జనం సాక్షి);**
తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ సారి వరి దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని, జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని, దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అపరల్ పార్క్, గోదాములకు తరలించి.. అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు నీరు, ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇట్టి పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండాకు చెందిన బానోత్ శర్మన్ (48) శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు విద్యుత్ వైర్‌తో ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

## భాజపా ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై అవగాహన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 29 (జనంసాక్షి) :** వేములవాడ, అర్బన్ బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై కార్యకర్తలకు అవగాహన సదస్సును వేములవాడ భాజపా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాజాపా రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, అల్లాడి రమేష్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రోగ్రామ్ కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న బోగస్ ఓట్లను ఏరివేయడమే కాకుండా దేశ భవిష్యత్తు కోసం పునాదులు వేయబడుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడ ఒక ఓటర్ పలుచోట్లలో ఉన్న ఓట్లను తొలగించడం ఓటుకు భద్రత కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త,బూత్ అధ్యక్షులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మీ యొక్క వార్డులో ఉన్న డబల్ ఓట్లను,బోగస్ ఓట్లను గుర్తించేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్,ఏరెడ్డి రాజిరెడ్డి, కౌన్సిలర్లు కొండ్లెపు చిన్న ముత్యం,వంగల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తాం



**కామారెడ్డి ప్రతినిధి, మే (జనంసాక్షి) :** కామారెడ్డి పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి హీరో ద్విచక్ర వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పాత జాతీయ రహదారి హైదరాబాద్ రోడ్డులో హీరో షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. అందుకోసం హీరో సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారులకు అబిరుచిగా అనుగుణంగా వివిధ రకాల మోడళ్లను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ఫ్యూచర్లతో తమ సంస్థ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి తెస్తుందన్నారు. వాహనం కొనుగోలు చేసే వారికి సులభమైన పద్దతిలో ఉండేందుకు ఆయా ఫైనాన్స్ సంస్థలు సైతం అందుబాటులో ఉండి సహకరించడం జరుగుతుందని తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రం లోని పాత జాతీయ రహదారి లో ఈ హీరో వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ హీరో షోరూం లో కొత్త అప్డేట్ హీరో 2.0 కస్టమర్ ఎక్స్పీరియన్స్ హీరో షో రూమ్ ఇది అని ప్రతినిధులు తెలిపారు. కామారెడ్డి వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ హీరో షో రూమ్ నిర్వాహకులు యాజమాన్యానికి కామారెడ్డి లో ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నూతన షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రంలో షోరూం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలాల కూడికతీత పనులు వేగవంతం చేయాలి

**దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకట మణికరణ్.**

**నిజాంపేట్ మే 28( జనం సాక్షి) :** దుండిగల్ సర్కిల్ పరిధిలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, నాలాలలో పూడికతీత పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ అధికారులకు ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని అన్ని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఓపెన్ నాలాలలో పేరుకుపోయిన సిల్ట్, మురుగు, చెత్త తదితరాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసే విధంగా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అలాగే, నాలాలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఐపీఎల్ ముగింపులో.. జోరుగా బెట్టింగ్



### రాజోలి హైస్కూల్.. క్రికెట్ బెట్టింగ్ అడ్డా

- క్రికెట్ బెట్టింగ్‌ల కోసం బైక్‌లు తాకట్టు
- గెలిచేవారు 10 శాతం..కోల్పోయేవారు 90 శాతం
- రాజోలిలో తాజాగా రూ.1 లక్ష పోగొట్టుకున్న యువకుడు

**రాజోలి, మే 29 (జనంసాక్షి) :** ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ముగింపు దశకు చేరుకోవడంతో రాజోలి మండలంలో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. తాజాగా రాజోలి ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణం బెట్టింగ్లకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. రాత్రి 7 గంటలకు మ్యాచ్ టాస్ పడగానే కొంతమంది యువకులు స్కూల్ ఆవరణలో ఒకేచోట చేరుకొని బెట్టింగ్లు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కొందరు యువకులు ఆన్లైన్ యాప్ ల ద్వారా, మరికొందరు నేరుగా నగదు రూపంలో పందేలు కాస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ విద్యాసంస్థ ప్రాంగణమే ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు వేదిక కావడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు వరుసగా బెట్టింగ్లో ఓడిపోయి ఏకంగా రూ. 1లక్ష వరకు నష్టపోయినట్టు తెలిసింది. మొదట చిన్న మొత్తాలతో మొదలైన అలవాటు..చివరకు అతడిని అప్పుల ఊబిలోకి నెట్టేసింది. డబ్బులు తిరిగి గెలుస్తాననే ఆశతో మళ్లీ మళ్లీ బెట్టింగ్ పెట్టి చివరకు చేతులెత్తేశాడని సమాచారం. ప్రస్తుతం ఆ యువకుడు తీవ్ర మనస్తాపంలో ఉన్నట్టు సమాచారం.

**బెట్టింగ్‌ల కోసం బైక్‌లు తాకట్టు**


మండల కేంద్రంలోని కొంతమంది యువకులు బెట్టింగ్‌ల కోసం ఏకంగా తమ ద్విచక్ర వాహనాలను తాకట్టు పెట్టినట్టు తెలిసింది. మొదట చిన్నగా ప్రారంభమైన బెట్టింగ్‌లు, తర్వాత భారీ నష్టాలకు దారితీయడంతో డబ్బుల కోసం బైక్‌లను కూడా అప్పుగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. గెలిస్తే ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందనే ఆశతో యువకులు అప్పులు చేసి, ఆన్‌లైన్ లోన్ యాప్‌లను ఆశ్రయిస్తూ చివరకు ఆస్తులను తాకట్టు పెట్టే స్థాయికి చేరుతున్నారని సమాచారం. కొందరు మొబైల్ ఫోన్లు కూడా తాకట్టు పెట్టి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.
ఇప్పటికే పలువురు యువకులు లక్షల్లో నష్టపోయి తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ చివరకు కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతోందని పెద్దలు హెచ్చరిస్తున్నారు.

**బెట్టింగుల కోసం ఆన్‌లైన్ రుణాలు**

ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆశతో కొంతమంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు బానిసలవుతున్నారు. చేతిలో డబ్బులు లేకపోయినా ఆగకుండా, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా అధిక వడ్డీకి రుణాలు తీసుకుంటు న్నట్టు సమాచారం. మరికొందరు స్థానికంగా వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి బెట్టింగుల్లో డబ్బులు పెట్టేస్తున్నారు. అంతటితో ఆగకుండా, కొందరు తమ ద్విచక్ర వాహనాలు, బంగారం ఉంగరాలు తాకట్టు పెట్టి మరీ బెట్టింగులకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ప్రారంభంలో చిన్న మొత్తాలతో మొదలైన ఈ అలవాటు, తర్వాత పెద్ద మొత్తాల అప్పులకు దారితీస్తోంది. గెలుస్తామనే ఆశతో మళ్లీ మళ్లీ డబ్బులు పెట్టి చివరకు చేతులెత్తేస్తున్నారు. అయితే క్రికెట్ బెట్టింగుల్లో డబ్బులు వచ్చిన వారు పది శాతం మంది వుంటే పోగొట్టుకున్న వారు 90 శాతం మంది వున్నారని అంటున్నారు.

**క్రికెట్ బెట్టింగ్ ఆడితే జైలే : ఎస్ఐ వార్నింగ్**

గ్రామాల్లో రహస్యంగా బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. సమాచారం అందితే వెంటనే దాడులు నిర్వహిస్తాం. క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనే వారు, నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టి పెట్టాలని, అనుమానాస్పదంగా డబ్బుల లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. యువత క్రీడలను వినోదంగా మాత్రమే చూడాలి కానీ, బెట్టింగ్‌లకు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోండి. ఎవరైనా బెట్టింగ్ పాల్పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 100కు సమాచారామివ్వండి.



-రాజోలి ఎస్ఐ, కె.గోకారి

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనండి

- నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వం సాధించాలి
- కాంగ్రెస్ బూటకపు వాగ్దానాలు, రైతులను మోసం చేసింది
- రేవంత్ రెడ్డి పాలనకు చిమరగీతం పాడాల్సిన సమయం
- మోమిన్‌పేట్‌లో బీఆర్ఎస్ సమావేశం



**మోమిన్‌పేట్, మే 29 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించాలని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు వికారాబాద్ ఇన్‌చార్జి గట్టు రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మోమిన్‌పేట్ మర్పల్లి మండలాల సీనియర్ కార్యకర్తల సమావేశం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టి ప్రతి కార్యకర్త తన వంతు కృషి చేసి భారీగా సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు.
తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించేది బీఆర్ఎస్ పార్టీ అని వారు అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బూటకపు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిందని, రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులను మభ్యపెట్టి మాయమాటలు చెప్పి రైతుబంధు, రైతు బీమా, ఎరువుల కొరత, రైతు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సరిగా కొనలేని పరిస్థితి దాపురించిందని వారు విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు చిమరగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఒకవైపు ఉద్యోగులను, మరోవైపు విద్యార్థులను మోసం చేసి పబ్బం గడుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు నాసంపల్లి నరసింహారెడ్డి, మోమిన్‌పేట్ మర్పల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు డి. వెంకట్ శ్రీకాంత్ రెడ్డి, మండల సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు హరి శంకర్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, పీఏసీఎస్ల డైరెక్టర్లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిల్డర్ల హామీతో సెంట్రింగ్ కార్మికుల సమ్మె విరమణ

**న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం**



**ముషీరాబాద్, మే 29 (జనం సాక్షి):**
బిల్డర్స్ అసోసియేషన్ ఇచ్చిన హామీ మేరకు సెంట్రింగ్ కార్మికులు తమ సమ్మెను విరమిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కృష్ణ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రేటర్ హైదరాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పి. కృష్ణ, చైర్మన్ ఎస్. పరశురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా ఆకుల ప్రవీణ్ లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లలో ముఖ్యమైన ది సెంట్రింగ్ పని రేటు అడుగుకు 51 రూపాయలు ఇస్తామని బిల్డర్స్ అసోసియేషన్ హామీ ఇవ్వడం హర్షనియమని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సెంట్రింగ్ కార్మికుల సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకుంటామని అన్నారు. ఇతర చిన్న చిన్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తమ న్యాయమైన సమస్యలను శాసనసభ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యేలను కోరారు. వలస కార్మికులకు కార్మిక శాఖ నుండి గుర్తింపు కార్డుల మంజూరుకి కార్మిక శాఖ కమిషనర్ ప్రకటించినట్లు వారు తెలిపారు. తమ సమ్మెకు మద్దతు తెలిపిన సెంట్రింగ్ కాంట్రాక్టు కార్మికులకు మేస్త్రీలకు, అసోసియేషన్ సంఘాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే పోరాటస్ఫూర్తితో శాంతియుతంగా సామరస్యంగా మిగతా డిమాండ్లను సాధించుకుంటామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఆకుల ప్రవీణ్ కుమార్, కోశాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కమలాకర్ రాజు గౌడ్, మహమ్మద్ అహమ్మద్,బోరబండ మక్సుద్ తదితరులు పాల్గొన్నారు. ఫీట్ కు 51 బిల్డర్స్ అసోసియేషన్ తమకు ఆమోదం తెలిపిందని తెలిపారు. ఇతర చిన్న చిన్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తమ న్యాయమైన సమస్యలను శాసనసభ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యేలను కోరారు. వలస కార్మికులకు కార్మిక శాఖ నుండి గుర్తింపు కార్డుల మంజూరుకి కార్మిక శాఖ కమిషనర్ ప్రకటించినట్లు వారు తెలిపారు. తమ సమ్మెకు మద్దతు తెలిపిన సెంట్రింగ్ కాంట్రాక్టు కార్మికులకు మేస్త్రీలకు, అసోసియేషన్ సంఘాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే పోరాటస్ఫూర్తితో శాంతియుతంగా సామరస్యంగా మిగతా డిమాండ్లను సాధించుకుంటామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఆకుల ప్రవీణ్ కుమార్, కోశాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కమలాకర్ రాజు గౌడ్, మహమ్మద్ అహమ్మద్,బోరబండ మక్సుద్ తదితరులు పాల్గొన్నారు.

శనివారం
30 మే 2026
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కట్టింగ్ పెట్టొద్దు..
- గోదావరిఖని జనరల్ ఆసుపత్రి.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల.. రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :**
రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరిఖని లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల శారద నగర్, గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలోని రక్త పరీక్ష కేంద్రంలో సమయం ముగిసిందని ఏ రోగిని వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గైనిక్ ఓపీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారద నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఫలితాలు, స్టడీ రూమ్ సౌకర్యం, అడ్మిషన్లు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెకళాశాల కు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. అనంతరం గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్ పెట్టడానికి వీలు లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లారీలను ఎప్పటికప్పుడు దించుకోవాలని, ఎక్కువ సమయం వేచి ఉండే పరిస్థితి కల్పించవద్దని మిల్లర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో డాక్టర్ లు అరుణ ,కృపాభాయి, రాజు, సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



# బీబీపేట మండలంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి ప్రతినిధి, మే 29 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట మండలంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం నాణ్యత, తూకం విధానం, హమాలీ సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై ఆరా తీశారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.
కేంద్రంలో ధాన్యం నిల్వ విధానం, ఆన్‌లైన్ నమోదు, టోకెన్ వ్యవస్థ, చెల్లింపుల వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్ డీసీవో రామ్ మోహన్, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మీద గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తాం

- పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, వొడితల ప్రణవ్



**హుజురాబాద్, మే 29 (జనం సాక్షి) :**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ పై వాడ వాడల ప్రజలకు అవగాహన కల్పించి ముందుకు వెళ్లాలని, దానికోసం పోలింగ్ బూత్ ఏజెంట్లు పకడ్బందీగా కృషి చేయాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సర్ కో ఆర్డినేటర్ (సమన్వయ కర్త) కుత్బుల్లాపూర్ మాజీ శాసన సభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని దాన్ని అలాగే కొనసాగించాలని, ప్రజాస్వామ్యం లో ఓటు అనేది చాలా ముఖ్యమని సర్ పేరుతో బీజేపీ చేస్తున్న వాటిని కాంగ్రెస్ కార్యకర్తలుగా ప్రజల ఓటు హక్కు కాపాడాలని కోరారు. హుజురాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింట్ బూత్ లలో కాంగ్రెస్ నాయకులు సర్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ ఛైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, దేవస్థాన చైర్మన్లు, డైరెక్టర్లు, అన్ని మండలాల అధ్యక్షులు, అధ్యక్షురాల్లు, బ్లాక్ కాంగ్రెస్ బీసీ, ఎస్సీ, మైనారిటీ, సేవాదళ్,పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# గుండెపోటుతో కౌన్సిలర్ మృతి

### నివాళులర్పించిన ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల టౌన్ మే 29 (జనం సాక్షి) సిరిసిల్లలోని 27వ వార్డుకు చెందిన బి,ఆర్,ఎస్ పార్టీ కౌన్సిలర్ కాసర్ల పద్మ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆమె అనారోగ్యం కారణంగా గత పది రోజుల క్రితం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం రోజు ఉదయం నాలుగు గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ మృతి పట్ల పలువురు నాయకులు కౌన్సిలర్లు తమ సంతాపాన్ని ప్రకటిస్తూ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సిరిసిల్లకు చేరుకున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె మృతి చెందడం కలచివేసిందని, ఆమె కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కేటీఆర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్‌లు, నాయకులు, బి,ఆర్,ఎస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ రాజ్ శాఖలో బదిలీలు

### ఇఎన్‌సి కార్యాలయ సిబ్బందికి తీవ్ర నష్టం

**గంగాధర జనంసాక్షి :** నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖలో బదిలీలు చేయడం వలన తీవ్రంగా నష్టపోతున్నామని ఇ.ఎన్.సి.సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖలో ఎఫ్ఎస్‌టీసీ విధానంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది బదిలీ నిబంధనలకు విరుద్ధంగా ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్సరాలకు మించి కొనసాగుతున్న పరిస్థితి ఉంది. దీని వల్ల బదిలీలకు అర్హత కలిగిన ఇంజినీర్-ఇన్-చీఫ్ ఇఎన్‌సి కార్యాలయ సిబ్బంది తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుత బదిలీ కౌన్సెలింగ్‌లో అనేక స్థానాలు వాస్తవానికి ఖాళీలుగా పరిగణించబడాల్సి ఉన్నప్పటికీ ఎఫ్ఎస్‌టీసీ సిబ్బంది దీర్ఘకాలంగా కొనసాగుతున్న కారణంగా అవి ఖాళీలుగా చూపబడడం లేదు.ఫలితంగా అర్హులైన ఈ.ఎన్.సి సిబ్బందికి తమ ఎంపిక స్థానాలను పొందే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన బదిలీ మార్గదర్శకాల ప్రకారం ఒకే స్టేషన్‌లో దీర్ఘకాలం కొనసాగుతున్న ఎఫ్ఎస్‌టీసి సిబ్బందిని వారి మాతృ శాఖలకు లేదా సంబంధిత యూనిట్లకు తిరిగి పంపించి ఆ స్థానాలను ఖాళీలుగా ప్రకటించాలని ఇఎన్‌సి సిబ్బంది కోరుతున్నారు. బదిలీ ప్రక్రియలో పారదర్శకత సమానత్వం మరియు న్యాయం కోసం అర్హత కలిగిన ఈఎన్‌సి సిబ్బందికి అవకాశాలు కల్పించే విధంగా సంబంధిత ఖాళీలను బదిలీ కౌన్సెలింగ్‌లో ప్రదర్శించాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నల్ల వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి టిఎన్జీవో నాయకులు

**కరీంనగర్ అర్బన్, మే 29 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తాసిల్దార్ నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొందిన నల్ల వెంకటరెడ్డిని శుక్రవారం రోజు ఎన్జీవో నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా ఎంప్లాయిస్ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి, నాయకులతో కలిసి మాట్లాడుతూ... స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నల్ల వెంకటరెడ్డి రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదోన్నతులు అందుకోవాలని, అలాగే ప్రభుత్వ పరిపాలనలో ప్రజలకు, ఉద్యోగులకు మరింత సేవలు అందించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, మహిళా చైర్మన్ ఇరుమల్ల శారద, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్, నాయకులు గోవిందపతి శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.



# గడ్డి మందు తాగి రైతు మృతి



**గంభీరావుపేట మే 29( జనం సాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాల్వంచఅశోక్ అనే రైతు గడ్డి మందు త్రాగి మృతి చెందినట్లు తెలిపారు పోలీసుల వివరాల ప్రకారం కొత్తపెల్లి గ్రామానికి చెందిన పాల్వంచ అశోక్ కు భార్య లావణ్య ఇద్దరు పిల్లలు కుమారుడు శ్రేయాన్ష (7) కూతురు ప్రణవి (9) ఉన్నారు, భార్య లావణ్య తెలిపిన వివరాల ప్రకారం నా భర్త వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు పొలంలో నీరు లేక పొలం ఎండిపోయి, ఈ మధ్యనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులు అయినాయని, 20 తారీకు రోజున నా భర్త గడ్డి మందు తాగినాడని చికిత్స కొరకు ఎల్లారెడ్డిపేట హాస్పిటల్లో ఉంచామని శుక్రవారం రోజు మరణించారని తెలిపారు ఇట్టి విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# పీఎంజే రాబరీ సూత్రధారి సుభోధ్ సింగ్ అరెస్ట్

- బీహార్ జైలు నుంచి కరీంనగర్‌కు తరలింపు
- ఆరు కోర్టుల పీటీ వారెంట్లతో కస్టడీ
- వారం రోజుల పోలీసు కస్టడీ కోరిన పిటిషన్
- దర్యాప్తు త్వరలో మరిన్ని వివరాలు



**కరీంనగర్, మే 29 (జనంసాక్షి):**
ఈ నెల 3వ తేదీన కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీలో ఉద్యోగులపై కాల్పులు జరిపి సంచలన దోపిడీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు, సూత్రధారి సుభోధ్ సింగ్‌ను కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్‌లోని పూర్ణియా జైలు నుంచి ఆరు కోర్టుల పీటీ వారెంట్లతో అతడిని కస్టడీలోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.ఈ కేసుతోపాటు ఇతర కేసుల్లోనూ నిందితుడిగా ఉన్న సుభోధ్ సింగ్‌పై వివిధ కోర్టుల్లో నమోదైన కేసుల నేపథ్యంలో మొత్తం ఆరు కోర్టుల పరిధిలో పీటీ వారెంట్లకు అనుమతులు పొందిన అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. సుభోధ్ సింగ్‌తో పాటు ప్రత్యేక పోలీసు బృందం గురువారం రాత్రి కరీంనగర్‌కు చేరుకోగా, అర్ధరాత్రి నిందితుడిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో అతడిని జైలుకు తరలించారు. కేసుకు సంబంధించిన అంశాల పై మరింత లోతుగా విచారణ జరిపేందుకు నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించాలని కోరుతూ కరీంనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

### నూతన గ్రంథాలయ భవన నిర్మాణ

# పనులను పరిశీలించిన నగర మేయర్

### నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, మే 29 (జనంసాక్షి) :** నగరపాలక సంస్థ పరిధిలో రూ.7 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ లతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి తనిఖీ చేసిన ఆయన, పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన గ్రంథాలయం విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నట్లు మేయర్ తెలిపారు. నగర ప్రజలకు విజ్ఞాన కేంద్రంగా ఈ గ్రంథాలయం నిలవాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి దశలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురానుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రబుల్ దేశాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


### హమాలీ సెంటర్ నిర్వాహకులతో

# కొనుగోలు కేంద్రంలో గొలుమాలు

**ముత్తారం మే 29(జనంసాక్షి) :** ఆరుగాలం పండించి ధాన్యాన్ని రైతుల అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతు నెల రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి పడిగాపులు కాస్తుంటే ముత్తారం మండలం లక్కారం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మాత్రం జిల్లాలో ఎక్కడ లేని విధంగా సెంటర్ నిర్వాహలు హమాలీలు కుమ్మకై కొనుగోలు కేంద్రాల్లో అంతా గోల్ మాల్ వ్యవహారం నడుస్తోంది. సీడ్ కంపనికి సంబంధిన మగ వరి వడ్లను కొనుగోలు కేంద్రాల్లో బస్తా తూకం వేసి మిల్లులకు పంపిస్తున్న వ్యవహారం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొనుగోలు కేంద్రం నిర్వహకులు కుమ్మక్కై పెద్ద ఎత్తున లారీలను పంపిస్తూ లక్షల రూపాయలను దోచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో మగ వరి ధాన్యం పోసిన రైతులకు ఎలాంటి ఇంట్రాక్షన్స్ లేకుండా తూకం వేసి మిల్లులకు పంపిస్తున్నారని,నిజమైన రైతులకు మాత్రం తూకం వేయడం లేదని ఆరోపిస్తున్నారు. కొంతమంది రైతులకు తరుగు పేరుతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు,సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారు.అదే విధంగా కొనుగోలు కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన వారి ధాన్యాన్ని మాత్రమే ఎలాంటి సీరియల్ లేకుండా కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతుల ఆరోపిస్తున్నారు.రైతులను మోసం చేస్తున్నారని కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు చేస్తున్న వ్యవహారాన్ని బట్టబయలు అవడంతో స్థానిక ఎస్సై ఎం రవి కుమార్ సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేసారుకున్న పోలీసులు బాధితులను పోలీస్ స్టేషన్ కు తరలించారు.కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సందర్శన
- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే
- బీఎల్ఏల నియామకంలో జాప్యం తగదు, ఓటర్ల మ్యాపింగ్‌పై సమీక్ష



నిజామాబాద్ అర్బన్, మే 29 (జనంసాక్షి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించి, అర్హులందరి పేర్లు జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది దాటితే కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలకు ఎస్ఐఆర్ విధి విధానాలు, ఫారాల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని, డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం లోపాలు ఉంటే నోటీసులు జారీ చేయాలని తెలిపారు. జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు పరిష్కారం, అక్టోబర్ 1న తుది జాబితా ప్రచురణ షెడ్యూల్‌ను వెల్లడించారు. బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంలో జాప్యం తగదు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం విషయంలో రాజకీయ పార్టీలు జాప్యం చేయకుండా నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలు సత్వరం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు చెప్పారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో బీఎల్ఏల పాత్ర కీలకమని, తాత్సారం తగదన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల్లో జరిగిన సమీక్షలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్‌డీఓలు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొంటాం

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



మంథని, ( జనంసాక్షి ) : యాసంగి సీజన్ లో భారీ మొత్తంలో పంట చేతికి రావడం వల్ల ఆలస్యం అవుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని, అధైర్యపడవద్దని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మంథని వ్యవసాయ మార్కెట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. రైతులకు ధాన్యం కొనుగోలు చేసే వరకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడమే కాకుండా కొనుగోలు విషయం పైన ఎందుకు ఆలోచన చేయడం లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలోని వ్యవసాయం అంటే పండుగలా మారిందని వివరించారు. ప్రభుత్వ గోదాములు సరిపడకపోతే ప్రైవేట్ గోదాములను సైతం ఉపయోగించుకొని వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసి మద్దతు ధర అందజేస్తామని రైతులందరూ అండగా ఉండాలని పేర్కొన్నారు. వర్షాలు చెప్పి రావని, వాతావరణ మార్పు వల్ల వర్షాలు సంభవిస్తున్నాయని, రైతాంగం ఇబ్బంది పడడం పట్ల బాధగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. రైతాంగం పడుతున్న బాధను ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని తెలిపారు. ప్రతిపక్షాలకు వర్షాలు చెప్పి వస్తాయా అని ఎద్దేవా చేశారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా కొనుగోలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, ఆర్డీవో సురేష్, ఏడిఏ అంజనీ మిశ్రా, ఏఓ నవ్య మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఆర్టీఏ మెంబర్ సురేష్, నాయకులు తొట్ల తిరుపతి, గోటికార్ కిషన్ జి, మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్, కొటారి బాపు, నాయినేని జగన్ మోహన్ రావు, కర్ణ కృష్ణ, మాజీ సర్పంచ్ దొరగొర్ల శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెళ్ళి కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

# పోలీసు--పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతోనే త్వరిత శిక్షలు

- నిందితులకు శిక్షలు పడేలా సమీక్ష
- కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు జాగ్రత్త
- బాధితులకు నిజమైన న్యాయం కోసం కలిసికట్టుగా కృషి
- గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్ బలోపేతం



**రామగుండం, మే 29 (జనంసాక్షి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ప్రతి దశలో జాగ్రత్తలు పాటిస్తేనే బాధితులకు నిజమైన న్యాయం అందుతుందని ఆయన అన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో నమోదవుతున్న వివిధ రకాల కేసుల్లో దర్యాప్తు ప్రారంభం నుంచి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఎదురయ్యే సమస్యలపై గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేసుల విచారణలో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కూడా అత్యంత కీలకమని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు జరిగే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోర్టు విచారణ సమయంలో అవసరమైన సాక్ష్యాధారాలు, సాక్షులను సమర్థవంతంగా సమర్పించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.
కేసుల దర్యాప్తు సమయంలో బాధితుల వాంగ్మూలాలు నమోదు చేసే సమయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో ఎక్కడైనా సమన్వయ లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించిన సీపీ, గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటేనే బాధితులకు నిజమైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. న్యాయాధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ నేరస్థులకు తప్పనిసరిగా శిక్షలు పడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
30 మే 2026

# హైడ్రా ఉద్యోగంతో ఆత్మవిశ్వాసం

- హైడ్రా ఈగల్ టీమ్‌గా ప్రత్యేక గుర్తింపు



**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** హైడ్రాలో ఉద్యోగం... ట్రాన్స్జెండర్ల జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చింది. కొలువు తెచ్చిన గౌరవం.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇక వారు వెనక్కి చూడడంలేదు. విధులు ఎక్కడైనా.. ఎప్పుడైనా సిద్ధమంటున్నారు. చెరువులు, నాలాల కబ్జాలను తొలగించడంలో భాగస్వామ్యమౌ తున్నారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడంలో ముందుంటున్నారు. మొత్తం 16 మంది ట్రాన్స్జెండర్లకు హైడ్రా అవకాశం కల్పించింది. ఇందులో ట్రాన్స్ ఉమెన్ 11 మంది ఉంటే.. ట్రాన్స్మెన్ ఐదుగురున్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా వెరవ కుండా.. విధులు నిర్వహించి ప్రజా ఆస్తులు కాపాడడంలో భాగస్వామ్యమౌతు న్నారు. హైడ్రాలో మాకు దక్కిన ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదు.. మా జీవితాలకు కొత్త గుర్తింపు అని అంటున్నారు. హైడ్రా యూనీఫామ్ వేసుకోవడం గౌరవంగా భావిస్తున్నామని అంటున్నారు. "హైడ్రా ఈగల్ టీమ్" గా నామకరణం చేసి.. విధుల్లో భాగస్వామ్యులను చేయడం ఎంతో సంతోషంగా ఉందని ట్రాన్స్జెండర్లు చెబుతున్నారు.

### హైడ్రా ఈగల్ టీమ్‌గా సేవలు

కబ్జాదారులు ఎంతటి వారైనా.. హైడ్రా వెనుకడుగు వేయదు. హైడ్రా ఇచ్చిన ధైర్యంతో ఈగల్ టీమ్ పని చేస్తోంది. సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం, ఐలాపూర్లో 862 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడడంలో ట్రాన్స్జెండర్లు చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల మాదాపూర్ లో ఈదులకుంట కాపాడడంలో చురుకైన పాత్రపోషించారు. ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి పరిస్థితిని సర్దిచెప్పడం, అధికారులు--ప్రజల మధ్య సమన్వయం చేయడం వంటి పనుల్లో వారు ప్రత్యేక పాత్ర పోషించారు. వారిలో సహనం ఎక్కువ. భావోద్వేగాలను అర్థం చేసుకునే గుణం ఉంది. అందుకే ఫీల్డ్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారు అని హైడ్రా అధికారులు ప్రశంసిస్తున్నారు.

# టీబీ నిర్మూలన, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన పెంచాలి

- సమాజ సేవలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



ఆసిఫాబాద్, మే 29 (జనంసాక్షి) : టీబీ నిర్మూలన, మాదక ద్రవ్యాల నివారణపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ... ఆసిఫాబాద్ జిల్లాలో మాదక ద్రవ్యాల నివారణ, టీబీ నిర్మూలనకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. ఆసిఫాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శు క్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలు, ఆరోగ్య సేవలు, టీబీ నివారణ చర్యల పురోగతిని రాష్ట్ర గవర్నర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ సమాజ సేవలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలనీ గవర్నర్ పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించడం ద్వారా టీబీ, మాదక ద్రవ్యాల వంటి సామాజిక సమస్యలను నియంత్రించవచ్చన్నారు. సింథటిక్ డ్రగ్స్ సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని, యువతను రక్షించేందుకు అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సమాజంలో ఎన్జీవోలు, సేవా సంస్థలు బాధ్యతా యుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీబీ బాధితులకు పోషకాహారం అందించడం అత్యంత అవసరమని గవర్నర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంస్థలు టీబీ రోగులను దత్తత తీసుకుని వారికి పోషకాహారం అందించాలని సూచించారు. లోక్ భవన్ తరపున టీబీ నిర్మూలనకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ను మాదక ద్రవ్యాల, టీబీ రహిత జిల్లా గా, అభివృద్ధి చెందిన జిల్లా గా అవతరించాలని , అందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. గవర్నర్ సూచనలకు స్పందించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హరిత, జిల్లాలోని 4,064 మంది టీబీ రోగులకు పోషకాహారం అందించే బాధ్యతను జిల్లా యంత్రాంగం స్వీకరిస్తుందని ప్రకటించారు. జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్ర మాన్ని విజయవంతంగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటి సభ్యత్వాన్ని పెంచి, ఐ ఆర్ ఎస్ కార్యకలాపాలు మరింత క్రియాశీలకం చేస్తామని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో సభ్యత్వాన్ని పెంచడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ కు గవర్నర్ ప్రత్యేక మెమెంటో అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ఎస్పీ నితికా పంత్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మందా మకరందు,వివిధ శాఖల జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### గవర్నర్‌కు ప్రజాప్రతినిధుల ఘనస్వాగతం

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆసిఫాబాద్ ఐడిఓసి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు జిల్లా కలెక్టర్ కే హరిత, ఎస్పీ నితికా పంత్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, శ్రీ పాల్వాయి హరీష్ లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా మకరందు లు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు

**అధికారులతో సమీక్షించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమిక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నియమాలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దని అధికారులకు మంత్రి సూచించారు. దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టొద్దని తెలిపారు. అలాగే ప్రజల భావోద్వేగాలను గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్, ఫులే, జగ్జీవన్ రామ్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని చెప్పారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అభివర్ణించారు. విగ్రహాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాల్సి ఉందని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమికి ఎసరు
- నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు



**మేడ్చల్, మే29 (జనంసాక్షి) :** ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ. 3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం. ఈ భూమి డీల్‌లో బొల్లా రమేష్, బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదిరినట్లు దర్యాప్తులో బయటపడింది. బొల్లా బ్రహ్మనాయుడుకు నిమ్మల కుటుంబం నుండి రెండు విడతలుగా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. మొత్తం భూ లావాదేవీల్లో సుమారు నాలుగు కోట్లు చేతులు మారినట్లు దర్యాప్తులో తేలింది. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. చట్టబద్ధ హక్కులు లేకపోయినా ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో తమ భూమే అని నిందితులు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, అక్టోబర్ 2025లో వాటిని కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. అనంతరం కూడా అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. భూమి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

### 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

**హైదరాబాద్, మే 29 (జనంసాక్షి) :** 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ప్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ప్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ప్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్ఐజీ ప్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

### పెనుగంగలో పడి బాలుడు మృతి



**ఆదిలాబాద్, మే29 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. గంగమ్మ తల్లికి బోనం సమర్పించుకునేందుకు తన నానమ్మ బంధువులతో మండలంలోని సాంగిడి గ్రామ పెనుగంగ వద్దకు శుక్రవారం బోనం సమర్పించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బెతం సాయిదీప్ (14) బాలుడు పెనుగంగా వాగులో స్నానం చేస్తూ నానమ్మ, బంధువులు చూస్తుండగానే నీటి గుంతలోకి జారుకున్నాడు. దీంతో బాలుడిని కాపాడేలోపే మునిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెనుగంగా వద్దకు చేరుకొని బాలుడు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత



**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్‌లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రం ప్రారంభం

- సోయా ఉత్పత్తులను ప్రోత్సహించడానికే.. : కలెక్టర్

**ఆదిలాబాద్, మే29 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత , గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా సంఘాలు, గుడిహత్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోయాబీన్ పంట సాగు విస్తృతంగా ఉన్నప్పటికీ, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉండటం వల్ల రైతులు, మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందలేకపోతున్నారని గుర్తించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ సంస్థ ఇక్రిశాట్ సాంకేతిక భాగస్వామ్యంతో రూ. 30 లక్షల వ్యయంతో ఈ సోయా ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రారంభ బాల్య అభివృద్ధి పై అవగాహన కల్పిస్తూ గర్భధారణ సమయం నుంచి శిశువుకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఉండే 1000 రోజులు జీవితానికి బలమైన పునాది వంటివని తెలిపారు. ఈ కాలంలో పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్య, స్పందనాత్మక సంరక్షణ, భద్రత, తల్లిదండ్రుల శ్రేయస్సు అనే 6 సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, జడ్పీ సీఈవో రవి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మంజుల, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు

**హైదరాబాద్, మే29 (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శు క్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు. రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేసే దిశలో మరో అడుగు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళల చేతుల్లో కేవలం బ్యాంక్ పాస్‌బుక్స్ మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, ఆలోచనలకు, వ్యాపార కలలను సాకారం చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సాంకేతిక, వ్యాపార పరమైన సహకారం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం బంజారాహిల్స్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టీ-హబ్ సీఈఓ కవికృత్, వీ-హబ్ సీఈఓ సీత పల్లచోల, సెర్ప్ నాన్‌ఫామ్ డైరెక్టర్ జాన్సన్, డీఆర్‌డీవో ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు, పలు రంగాల నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. "ఈ రోజు మనం ప్రారంభిస్తున్నది ఒక సాధారణ కార్యక్రమం కాదు... తెలంగాణ గ్రామీణ మహిళల భవిష్యత్తును మార్చే ఒక ఆర్థిక ఉద్యమం" అని మంత్రి పేర్కొన్నారు. మహిళల చేతుల్లో కేవలం బ్యాంక్ పాస్‌బుక్స్ మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, ఆలోచనలకు, వ్యాపార కలలకు బలమైన వేదికగా ఈ ఇంక్యుబేటర్లు పనిచేస్తాయని అన్నారు. బిట్స్ పిలానీ, దేశంలోనే అగ్రశ్రేణి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం అయిన టీ-హబ్ భాగస్వామ్యంతో రెండు ప్రత్యేక ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370